J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 20




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 53 4.6.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



## సిగ్గు - లజ్జ, మంచి - మానవత్వం వదిలి... కరోనాని క్యాష్ చేసుకుంటున్న

# మెడికల్ మాఫియా

**కరోనా రాక్షసి అత్యంత కర్కశంగా ప్రజల ప్రాణాలను బలితీసుకుంటోంది. ఇదే కరోనాని అడ్డం పెట్టుకుని, ప్రైవేటు రంగంలో డాక్టర్లు, ఫార్మాసిస్టులు, స్కానింగ్ సెంటర్లు, లాబొరేటరీలు, సర్జికల్ దుకాణదారులూ చివరకు అంబులెన్సు యజమానులతో సహా అందరూ ఒక్కటై ప్రజలను పీక్కుతింటున్నారు.**

రాజకీయ వత్తిడి, వ్యక్తిగత మొహమాటం, కాసుల కక్కుర్తితో అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం బేఖాతరు చేసి చోద్యం చూస్తున్నారు. కొన్ని చోట్లయితే అధికారులూ, అధికార పార్టీ నేతలూ నేరుగా రంగంలోకి దిగి దోపిడీకి తెర లేపారన్న ఆరోపణలు రావడం సిగ్గుచేటు.

సాధారణంగా మనం మందుల దుకాణంలో ఒక రూపాయి పెట్టి మాత్ర కొంటే అందులో 20శాతం డాక్టర్‌కి కమీషన్‌గా వెళ్తుంది, మరో 20శాతం ఫార్మసిస్ట్ వాటాకి పోతే మరో 20శాతం డిస్ట్రిబ్యూటర్ భాగానికి జమవుతుంది. అంటే మందు తయారీదారుడికి చేరేది 40 పైసలే. అందులో కొంత శాతం తయారీ ఖర్చులకి, టాక్సులకి పోగా అక్కడకూడా బాగానే మిగుల్తుంది. ఇది సర్వ సాధారణంగా జరిగే తంతే. అయితే ఇప్పుడు కరోనా మహమ్మారిని ఆ వ్యాధి ద్వారా వచ్చే దుష్ఫలితాలని భూతద్దంలో చూపించి ఎవరికి దొరికిన మేరకు వాళ్ళు దోచుకుంటున్నారు. ఉదాహరణకు ఒక సాధారణ నర్సింగ్ హోమ్‌లో మనం చికిత్స కోసం చేరితే అక్కడ ప్రత్యేక గది కావాలంటే, ఆసుపత్రి స్థాయిని బట్టి రోజుకి 2 వేల నుండి 5 వేల రూపాయల వరకు గది అద్దె వసూలు చేస్తారు. 2 వేల రూపాయలు వసూలు చేసే గది 3 నక్షత్రాల హోటల్లో బాత్రూం కంటే అధ్వాన్నంగా ఉంటుంది. అలాంటి గదులకు కూడా ఇప్పుడు రోజుకి 20 వేల రూపాయలు ముక్కుపిండి మరీ గుంజుతున్నారు. మహానగరాల్లో 7 నక్షత్రాల హోటళ్లలో కూడా ఈ ధరలు ఉండవు. ఇక ఈ గదులలో చేరినప్పటినుండీ అన్నిటికి ఛార్జీలే. వీళ్ళు చేసే రోజువారీ ఛార్జీలతో కలుపుకుంటే రోజుకి 30వేల రూపాయలు వదిలిపోతాయి. కొంతమంది డాక్టర్లయితే నగరంలో ఈగలు తోలుకుంటున్న నికృష్టమైన ఆసుపత్రులను లీజుకి తీసుకుని ఈ గలీజు పనులకు తెర లేపారు. మరికొంత మంది డాక్టర్లు ఏకంగా మిషనరీ ఆసుపత్రులని తమ కబ్జాలోకి తీసుకుని వ్యాపారం మొదలుపెట్టారు. ఇది ఒక్క నెల్లూరు నగరంలోనే కాదు, రాష్ట్రమంతా ఇలాగే ఉంది. అయితే నెల్లూరు డాక్టర్లు ఒక అడుగు ముందుకు వేసి తమ దోపిడీ కొనసాగిస్తున్నారు.

### మెడికల్ మాయాబజార్‌గా నెల్లూరు 'పొగతోట'

పొగతోట డాక్టర్లకు ప్రసిద్ధి. ఇప్పటి పరిస్థితుల్లో ఎవరైనా ఈ పొగతోట వైపు కన్నెత్తి


2లో



## కథ కోర్టుకి.. 'ఆనందయ్య' ఇంటికి

ఆయన కరడు కట్టిన నేరస్తుడు కాదు. బ్యాంకులకు కోట్లరూపాయలు ఎగ్గొట్టలేదు. కనీసం చీమకు కూడా హాని

2లో



# మెడికల్ మాఫియా

(మొదటి పేజీ తరువాయి)


చూస్తే మటాషే. పేషంట్ల కోసం పాగావేసి వున్న కొంతమంది వారిపై 'పగ'పట్టినట్లుగా పేషంట్ల ఒళ్ళు గుల్ల చేస్తున్నారు. కొంత మంది మహిళా డాక్టర్లు కూడా ఉచ్ఛం నీచం మరచి వ్యాపారమే ధ్యేయంగా డబ్బు సంపాదనే లక్ష్యంగా మానవత్వం మరచి పోయి ప్రవర్తిస్తున్నారు. పేషెంటు చని పోయాక కూడా ట్రీట్మెంట్ చేశామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒకటికి నాలుగు ఆసుపత్రుల్లో వాటా పెట్టుకుని దొరికినకాడికి దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఎక్కడా బిల్లులు ఇవ్వరు. ఇన్సూరెన్సు ఉందంటే ఒప్పుకోరు, ముందుగా కనీసం లక్షరూపాయలు అడ్వాన్సుగా ఇవ్వకుంటే అసలు చేర్చుకోరు. కొన్ని ఆసుపత్రులలో కనీస వసతులుకూడా ఉండవు, ఒక్క ఆక్సిజన్ తప్ప వెంటిలేటర్ సౌకర్యం కూడా ఉండదు. పేషంటు ఆతృతను అవకాశంగా తీసుకుని ముందు చేర్చేసుకుంటారు, రెండురోజులు ఉత్తుత్తి ట్రీట్మెంట్ చేసి మా దగ్గర వెంటిలేటర్ సౌకర్యం లేదు, వేరే దగ్గరకు తీసుకెళ్ళమంటారు, లేదంటే పేషెంటు బ్రతకడని కంగారు పెట్టేస్తారు. కిందో మీదో పడి వాళ్ళు వేరే ఆసుపత్రిలో వెంటిలేటర్ చూసుకుంటే ఇక్కడ కళ్ళు తిరిగే బిల్లులు వేస్తారు, కట్టకుంటే డిశ్చార్జ్ చెయ్యరు. లేటైతే ప్రాణానికే ప్రమాదమని సప్తరంగులు చూపిస్తారు. పేదవారనే కనికరంలేదు, అమాయకులనే జాలి లేదు, అయ్యో పాపం అన్న దయ లేదు. వీరికి డబ్బే ప్రధానం, సంపాదనే ముఖ్యం. సాటి మనిషి ఏమైపోయినా పరవాలేదు. తాము కోట్లు సంపాదించాలి, అన్నం బదులుగా డబ్బులే తినాలి... ఇదీ వారి దృక్పథం.

## డాక్టర్ల దారిలోనే మిగిలిన విభాగాలు సైతం

'వైద్యో నారాయణో హరిః' అంటే డాక్టర్ దేవుడితో సమానమని అర్థం. అలాంటి డాక్టర్లే దయా దాక్షిణ్యాలు లేకుండా దోపిడీ చేస్తుంటే ఇక తమదేం పోయిందన్నట్లుగా మిగిలిన విభాగాలు కూడా తమ ఇష్టానుసారం లూటీ చేయడం మొదలుపెట్టాయి. మందుల షాపులో మందుల ధరలు పెరిగాయి. పల్స్ ఆక్సీ మీటర్లు రెట్టింపు రేటు పలుకుతున్నాయి. ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు నల్లబజారుకి చేరాయి, అంబులెన్సు ధరలు ఆకాశాన్నంటాయి. మొత్తానికి కరోనా పుణ్యమా అంటూ, మెడికల్ మాఫియా ఆస్తులు పెరిగాయి, సామాన్యుడి సొమ్ములు కరిగాయి. మానవత్వం మంట కలిసింది, మనిషి తత్త్వం పాడెక్కింది. డాక్టర్లు అందరూ ఇలాగే వున్నారని మేమనడం లేదు. కరోనా చికిత్స అందిస్తున్న వారిలో 90శాతం మందికిపైగా ఇదే దోవలో నడుస్తున్నారన్నది మాత్రం ప్రజాభిప్రాయం. అందుకే మళ్ళీ మళ్ళీ అంటున్నాం ఇది కలియుగం కాదు కలుషిత యుగం అని.

# కొద్దిగా తగ్గిన కరోనా

- వేలల్లోంచి వందల్లోకి వచ్చిన కేసులు



జిల్లాలో కరోనా కేసులు కొద్దిగా తగ్గుముఖం పడుతున్నాయి. మొన్నమొన్నటి దాకా రోజుకు వేలల్లో ఉన్న ఈ సంఖ్య ఇప్పుడు వందల్లోకి వచ్చింది. ఈనెల 2వ తేది బుధవారం ఒక్కరోజు 6735 మందికి కరోనా పరీక్షలు చేస్తే అందులో 785 మందికి కరోనా నిర్ధారణ అయింది. కోవిడ్ ఆసుపత్రుల్లో మొత్తంగా 1455 మంది, కోవిడ్ కేర్ సెంటర్లలో 665 మంది చికిత్సలు పొందుతున్నారు. వీరిలో ఈనెల 2వ తేదిన పది మంది మరణించారు. దీంతో జిల్లాలో ఇప్పటిదాకా లక్షా 19వేలా 286 మంది కరోనా మహమ్మారి వ్యాధి బారిన పడగా, 1,06,565 మంది కోలుకున్నారని, జిల్లాలో ఈ వ్యాధికి మొత్తం 832 మంది మృతి చెందారని, 11,889 యాక్టివ్‌కేసులు ఉన్నాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి. మొత్తానికి కేసులు కొద్దిగా తగ్గినట్లనిపించినా, మరణాల సంఖ్య పెరుగుతుండడంతో ప్రజల్లో ఇంకా కరోనా కలవరం పెరుగుతూనే ఉంది.

# 'ఆనందయ్య' ఇంటికి

(మొదటి పేజీ తరువాయి)

చేయలేని మనస్తత్వం ఆయనది. ఆయన చేసిందల్లా ఒక్కటే.. కరోనా బాధితులకు ప్రకృతి వైద్యం చెయ్యడం. కరోనా బారిన పడకుండా మూలికా మందు ఇవ్వడం.

ఆయన పేరే ఆనందయ్య. అయితే గత కొన్ని రోజులుగా ఆయనకు ఆ ఆనందమే కరువయ్యింది. పేరులోనే తప్ప నిజజీవితంలో ఆనందం లేకుండా పోయింది. రాజకీయ పార్టీలు, ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు, మెడికల్ మాఫియా ఆయనతో ఫుట్‌బాల్ ఆడుకున్నాయి. పాపం ఆయనను ముప్పతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్లు తాగించాయి. ఇంటికి పంపించినట్టే పంపించి మళ్ళీ పోలీసులతో పిలిపించుకున్నారు. ఇంటికి పంపించేదెవరో, మళ్ళీ పిలిపించుకునేదెవరో అర్థం కాక ఆనందయ్య కుటుంబ సభ్యులు అయోమయ స్థితిలో అల్లాడిపోయారు. ఒక దశలో పోలీసులు అధికారులూ నేరుగా ఆనందయ్య ఇంట్లోని ఆయన పడక గదిలోకి వెళ్లడం ఆయన కుటుంబసభ్యులను బాధపెట్టిందని ఆనందయ్య సమీప బంధువు వాపోయారు. 10 రోజుల హైడ్రామా తరువాత ఎట్టకేలకు జూన్ ఒకటవ తేదీ నాటికి ఆనందయ్య తిరిగి తన ఇంటికి చేరుకున్నారు.


ఇక్కడ అయోమయమల్లా ఒక్కటే...? ఆయనను ఎక్కడకు తీసుకెళ్లారు..?? ఎవరు తీసుకెళ్లారు..??? మళ్ళీ ఎందుకు వదిలిపెట్టారు... ఆ తరువాత ఎవరు తీసుకెళ్లారు..??? అంతా గందరగోళమే. లోతుల్లోకి వెళ్తే నేతలకు ఆగ్రహం వస్తుం



దేమో... మనకెందుకు లెండి. 'కథ కంచికి మనం ఇంటికి' అన్నట్లుగా, ఆనందయ్య కథ కోర్టుకి చేరింది... ఆయన ఇంటికి చేరాడు. కోర్టు ఆనందయ్య మందు పంపిణీకి అనుమతి ఇచ్చింది, ప్రభుత్వం అందుకు లైన్ క్లియర్ చేసింది. నేతలు, అధికారులు ఆనందయ్యను మంగళవారం వెంట బెట్టుకుని మీడియా ముందుకు వచ్చారు. లాంఛనంగా తమ పని అయిపోయింది కాబట్టి, ఇక వీలయినంత మందికి ఆనందయ్య మందిచ్చి ఆనందపరుస్తామని సెలవిచ్చారు. శుభం!.

# పేదలకు అన్నం ప్యాకెట్లు

నెల్లూరులోని పెద్దాసుపత్రిలో ఉన్న సుమారు రెండువందల మంది పేదలకు స్థానిక సర్వేపల్లి సేవాసమితి వారు గతనెల 30న అన్నం ప్యాకెట్లు అందించారు. దిశ పోలీస్‌స్టేషన్ డిఎస్పీ నాగరాజు, రామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సర్వేపల్లి సేవాసమితి అధ్యక్షుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# ఆన్‌లైన్‌లోకి రానున్న.. ఆనందయ్య మందు

➢ ఈనెల 7 నుంచి పంపిణీకి సన్నాహాలు

**- ఎమ్మెల్యే కాకాణి వెల్లడి**

ఎట్టకేలకు ఆనందయ్య మందు పంపిణీకి సిద్ధమవుతోంది. ఆన్‌లైన్‌లోనూ ఈ మందు అందుబాటులోకి రానుంది. గత కొద్దిరోజులుగా దీనికి అనుమతులు వస్తాయో లేదో అనుకుంటున్న కరోనా బాధితులకు అటు హైకోర్టు ఉత్తర్వులు, ఇటు ప్రభుత్వాదేశాలతో ఆ మందు పంపిణీకి గ్రీన్‌సిగ్నల్ లభించడంతో ఆనందయ్య మందుకోసం ఎదురుచూస్తున్న వారిలో సంతోషం కలుగుతోంది. త్వరలోనే ఈ మందు పంపిణీ ప్రారంభమవుతుందని, కోవిడ్ నిబంధనలను పాటిస్తూ, ఈనెల 7వ తేది నుంచి పంపిణీ చేసేందుకు ప్రయత్నం జరుగుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 1న ఆయన నెల్లూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్‌లతో పాటు ఆనందయ్యతో కలసి సమావేశమయ్యారు. అనంతరం కాకాణి మాట్లాడుతూ వనమూలికలు సమకూర్చుకున్న తర్వాత నాలుగైదు రోజుల్లోనే మందు తయారుచేసి పంపిణీ చేస్తామని ఆనందయ్య తెలిపారని చెప్పారు. కోవిడ్ నేపథ్యంలో ఎవరూ కృష్ణపట్నానికి రాకుండా అవసరమైనవారికి నేరుగా కొరియర్ పద్ధతి ద్వారా మందును పంపించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆనందయ్య మందు తయారీకి అనుమతించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా యంత్రాగం తరఫున కాకాణి ధన్యవాదాలు తెలిపారు.



### కోవిడ్ నిబంధనలు పాటించాలి :

జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ ఆనందయ్య మందు కోసం జిల్లాలోని వారు కానీ, ఇతర ప్రాంతాల నుంచి కానీ ఎవరూ కృష్ణపట్నం రావొద్దని సూచించారు. కోవిడ్ నిబంధనలు, కర్ఫ్యూ అమలవుతున్న దృష్ట్యా ఎలాంటి ఉల్లంఘనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోవిడ్ నిబంధనలను అందరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆనందయ్య మందును ఆన్‌లైన్‌లో కూడా బుక్‌చేసుకోవచ్చని, దీనికోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నామన్నారు. కోవిడ్ పాజిటివ్ వచ్చినవారికే మందు పంపిణీలో తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. మందు తయారీ, పంపిణీ ఏర్పాట్లను రెవెన్యూ, పోలీసుశాఖలు సమన్వయంతో చేపట్టడం జరుగుతుందని వివరించారు. కంటి చుక్కల మందు విషయంలో కోర్టు ఉత్తర్వులు రాగానే తదనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలి - ఆర్డీఓ

జిల్లా గృహనిర్మాణశాఖ ఆధ్వర్యంలో జరిగే ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని నెల్లూరు ఆర్‌డిఓ హుస్సేన్‌సాహెబ్ సంబంధిత అధికారులకు సూచించారు. నెల్లూరు నగరంలోని లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇళ్ళ నిర్మాణానికి అవసరమైన వస్తుసామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.



## జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి

# బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

● ఏకాంతంగానే ఉత్సవాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 1న వేదపండితుల వేద మంత్రోచ్ఛటనల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. పుట్టమట్టిని తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అయితే కరోనా కారణంగా భక్తుల ప్రవేశానికి అనుమతి లేదని ఆలయ వర్గాలు తెలిపాయి. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు భౌతికదూరం పాటిస్తూ పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, ఇ.ఓ ఏవి శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

### 11వ తేది వరకు బ్రహ్మోత్సవాలు :

జూన్ 1 నుంచి 11వ తేది వరకు జొన్నవాడలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, స్వామివార్లకు అన్ని పూజలు, సేవలు అన్నీ ఏకాంతంగా నిర్వహిస్తామని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 1న అంకురార్పణ, 2న ధ్వజారోహణం, 3న శేషవాహనోత్సవం జరిగాయి. 4న పురుషామృగవాహనం, 5న సింహవాహనం, 6న హంస వాహనం, 7న రావణసేవ, 8న వెండినంది సేవ, 9న వెండి రథోత్సవం నిర్వహించనున్నారు. 10వ తేదిన స్వామి-అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగనుంది. అనంతరం 11న ఏకాంత సేవ నిర్వహిస్తారు. కోవిడ్ నిబంధనల దృష్ట్యా ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులకు, ఉభయకర్తలకు కూడా ఎలాంటి అనుమతులు లేవని, ఈ విషయం గమనించి అందరూ సహకరించాలని ఆలయ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



‘ప్రభా’తం

# పొగ.. ప్రాణాలకు సెగ

ధూమపానం వల్ల, పొగాకు ఉత్పత్తుల వల్ల దేశంలో ఏటా కోట్లాదిమంది ప్రాణాలు పోతూనే ఉన్నాయి. క్యాన్సర్, క్షయ, గుండెజబ్బులు, పక్ష వాతం, గొంతువ్యాధులు, దగ్గు, ఆయాసం వంటి రోగాలు వచ్చేది ఎక్కువగా ఈ దురలవాటు వల్లే. ముఖ్యంగా యువత మరింత ఎక్కువగా ఈ వ్యసనానికి దాసోహమైపోతు న్నారు. అందులోనూ ఇప్పుడు కరోనా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో 50 శాతం పైగా పొగరాయుళ్లకు కోవిడ్ ముప్పు ఉందని వైద్యనిపుణులు హెచ్చ రిస్తున్నారు. ఇకనైనా ఈ అలవాటు మానుకోవాలి. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభు త్వాలు పటిష్టమైన చర్యలతో వాటిని వెంటనే పూర్తిస్థాయిలో నిషేధించాలి.



పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్..అన్నది పాత మాట. ఇప్పుడు ‘పొగ తాగినవాడు కరోనాతో చచ్చున్’..అని మార్చుకోవాలేమో!.. ఏం చేస్తాం?..రోజులు మారిపోయాయి..రోగాలూ మారిపోతున్నాయి. సరదా సరదా సిగరెట్టూ..అంటూ షోకిల్లారాయుళ్ళలా దమ్ముకొడుతూ షికార్లు చేసే పొగరాయుళ్ళకి ఇప్పుడు చేటుకాలం దాపురిస్తోంది. కరోనా రాకాసి రోడ్లమీద తిరుగుతూ పొగరాయుళ్ల అంతుచూసేందుకు పొంచి ఉంది. ఏదో సరదాగా..కాలక్షేపానికని అలవాటైన ధూమపానం కాస్తా యువతలో వ్యసనంగా మారిపోవడమే కాక, ఆ నికొటిన్ మత్తులో గమ్మత్తుగా మునిగిపోతూ దానికి బానిసలైపోతున్నారు. ఆ తర్వాత అది క్రమేణా రోగాల వైపుకి తీసుకెళ్ళి ప్రాణాలను పీక్కుతింటోంది. పొగ తాగడం అలవాటు చేసుకున్నాక మానలేని బలహీనతే వారి అనారోగ్యానికి దారితీస్తోంది. దేశంలో ఎక్కడ చూసినా సిగరెట్ల కొట్ల దగ్గర గుంపులు గుంపులుగా జనం..దమ్ముకొడుతూ కరోనా మనల్నేమి చేస్తుందిలే అనుకుని జోకులేసుకోవడం చూస్తూనే ఉన్నాం. సరిగ్గా..కరోనాకి కావల్సింది ఇదే. బంకుల దగ్గర సిగరెట్లు అమ్మేవాళ్లు కానీ కొనేవాళ్ళు కానీ చేతుల్ని శానిటైజ్ చేసుకోవడం, మాస్కులు ధరించి భౌతికదూరం పాటించడం..కోవిడ్ నిబంధనల్ని అనుసరించడం వంటివన్నీ సాధారణంగా పట్టించుకోరు. దీంతో ఎవరిపాటికి వారు యధేచ్ఛగా దమ్ము కొడుతూ..తమ లోకాల్లో తాము విహరిస్తుండడం అలవాటైపోయింది. ఇవన్నీ కరోనాకి సాదరస్వాగతం పలికే పనులే. అసలే కరోనా రాకాసి వ్యాధి అత్యంత భయంకరంగా ప్రజల ప్రాణాలు తీస్తూ నిత్యం లక్షలాదిమందిని బలితీసుకుంటున్నా పొగరాయుళ్ళలో మాత్రం చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. సరికదా చుట్టుపక్కల వాతావరణాన్నంతా పొగ గబ్బుతో కంపుకొట్టిస్తూ తామేదో పెద్ద ఘనకార్యం సాధించినట్లుగా ఫోజులిస్తుంటారు. ‘సిగరెట్ తాగడం హానికరం కదా’ అని ఎవరైనా అంటే, ‘అందుకే కదా కాల్చిపారేస్తోందీ’..అని జోకులేసే వాళ్ళూ లేకపోలేదు. ‘సిగరెట్లు తయారుచేసేది ఎందుకు?..తాగేందుకే కదా’.. మనం తాగకపోతే ఫ్యాక్టరీలు పెట్టుకున్నోళ్ళకు పాపం ఎంత నష్టం!...అంటూ లాపాయింట్లేసేవాళ్ళు బోలెడంతమంది. ఈ పొగరాయుళ్లకెంత శుద్ధులు చెప్పినా శుద్ధ దండగని కాబోలు..పనిలోపనిగా వారి పని కూడా పట్టి తన తడాఖా ఏమిటో చూపిస్తానంటోంది రాకాసి కరోనా. పొగరాయుళ్ళ ఊపిరితిత్తుల్లోకి చేరి ప్రాణాలమీదికి తెస్తోంది. సాధారణ జనం కన్నా రోజూ సిగరెట్లు, బీడీలు కాల్చేవారిలో కరోనా వేగంగా వ్యాప్తి చెందుతూ మరణాలకు దారితీస్తోందని వైద్యనిపుణులు పదేపదే చెప్తూనే ఉన్నారు. కరోనా వైరస్ దాడి ఊపిరితిత్తుల మీదనే ఎక్కువగా ఉంటుంది కనుక పొగ తాగేవారికి వైరస్ సోకిందంటే చాలా కష్టం. వెంటిలేటర్ల దాకా వచ్చి చివరికి ప్రాణాల మీద ఆశ వదులుకోవాల్సిందే. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ విపత్తులోనైనా పొగ తాగడం మానకుంటే చేజేతులా చావును రారమ్మని పిలిచినట్లేనంటున్నారు వైద్యులు. సిగరెట్ పొగలో ఏడువేల రసాయనాల కంటే ఎక్కువే ఉన్నాయని, వీటితో క్యాన్సర్, క్షయ, గుండెజబ్బులు, పక్షవాతం, గొంతువ్యాధులు, దగ్గు, ఆయాసం వంటి రోగాలు రావడం ఖాయమని, పొగ తాగడం వల్ల కానీ, ఆ పొగను పక్కనున్నవారు పీల్చడం వల్ల కానీ రకరకాల జబ్బులు వస్తుంటాయని ఎంతోకాలంగా చెప్తూనే ఉన్నారు. కానీ పట్టించుకునే వారెవరు?..ప్రపంచవ్యాప్తంగా పొగరాయుళ్ళ సంఖ్య 130 కోట్ల మందికి పైగానే ఉందంటే అతిశయోక్తేమీ కాదు. అందులోనూ మనదేశంలో కూడా కోట్లాదిమంది ఉండనే ఉన్నారు. లక్షలాది మంది ఈ పొగతోనే ప్రాణాలకు సెగ పెట్టుకుంటున్నారట కూడా. యువత మరింత ఎక్కువగా ఈ వ్యసనానికి దాసోహమై పోతున్నారు. అంతేకాదు, దమ్ముకొట్టే వాళ్ళల్లో ప్రతి ఇద్దరిలో ఒకరు రోగాలతో మరణిస్తూనే ఉన్నారని, ఇకనైనా ఈ ఆలవాటుకు స్వయంగా ఎవరికి వారు స్వస్తిపలకాలని సాక్షాత్తూ ప్రపంచ ఆరోగ్యసంస్థ తాజాగా హెచ్చరిస్తోంది. మే31న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినంగా జరుపుకోవాలని ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలతో దాదాపు ఎనిమిది మిలియన్ల మందికి పైగానే చెప్పాపెట్టకుండా టపా కట్టేస్తున్నారని, ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ధూమపాన రక్కసి వల్ల ప్రతి ఆరు సెకన్లకు ఒకరు బలి అవుతూనే ఉన్నారని లెక్కలు కట్టి మరీ చెప్తోంది. ఈ వ్యసనాన్ని ఎవరికి వారు బుద్ధిగా వదిలిపెట్టేయడం మినహా మరో మార్గాంతరం లేదని సూచిస్తోంది. కనుక ‘నన్ను పీలిస్తే.. మీ ప్రాణాల్ని నేను పీలుస్తా’ అంటున్న ధూమపానం జోలికి పోకండి. పొగ తాగడం మానేయండి. ఈ కరోనా కాలంలో ప్రాణాలకు ప్రమాదం కొని తెచ్చుకోకండి. ఇంతకన్నా చెప్పదగిన సూచన ఏమీ లేదు. ధూమపానంలో ప్రధానమైన సిగరెట్, బీడీ, చుట్ట వగైరాలు, ఖైనీ, గుట్కా, పాన్‌మసాలా వగైరా పొగాకు ఉత్పత్తులు ఏటా కోట్లాదిమంది ప్రాణాలను బలిగొంటూనే ఉన్నాయి. పొగాకు వాడకంలో మనదేశం ద్వితీయస్థానంలో ఉండడం విచారకరం. ‘పొగాకు హానికరం’..అంటూ ఎన్ని బొమ్మలేసి ఎన్నేళ్ళు ప్రకటనలు గుప్పించినా ఫలితం ఉండదు. అసలు తయారీయే లేకుంటే తాగేదేముంది?..ఇలాంటి వ్యాపారాలన్నీ కట్టిపెట్టేసి ప్రజారోగ్యమే ప్రధానంగా ముందడుగు వేయాలి. ఇకనైనా కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలన్నీ ధూమపానాన్ని, పొగాకు ఉత్పత్తులన్నిటినీ పూర్తిగా నిషేధించి అమలుచేయడం, పొగాకు ఫ్యాక్టరీలన్నిటినీ మూసివేయించి, ఇతర దేశాల నుంచి కూడా వీటి దిగుమతులను నిషేధించడం, పొగాకు రైతుల జీవనానికి ఇబ్బంది లేకుండా వారు ఇతర పంటల సాగుపై దృష్టి పెట్టేలా చేయడం, మొత్తంగా ఆ వ్యసనాల వ్యాపారాలన్నిటికీ గట్టిగా చెక్ పెడితే తప్ప ఈ దుర్వ్యసనం నుంచి అటు జనానికి కానీ, ఇటు దేశానికి కానీ విముక్తి ఉండనే ఉండదని వేరే చెప్పనక్కరలేదు!..

# సాహితీవేత్త.. మోపూరు వేణుగోపాలయ్య ఇక లేరు



నెల్లూరుకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త, విఆర్‌సి విశ్రాంత తెలుగు అధ్యాపకుడు మోపూరు వేణుగోపాలయ్య (80) గతనెల 29న కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1957 నుంచి 1963 దాకా విఆర్ కళాశాలలో విద్యనభ్యసించి, ఆ తర్వాత 1961 నుండి 1963 దాకా తిరుపతి శ్రీ వేంకటేశ్వర యూనివర్శిటీలో ఎం.ఏ చదువుకుని, అనంతరం తాను చదువుకున్న విఆర్ కళాశాలలో ట్యూటర్‌గా చేరి, కొంతకాలానికి అదే కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా, తెలుగు విభాగాధిపతిగా పదోన్నతులు పొంది వేలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. ఎంఏ విద్యార్థులకు కూడా ఆయన విద్యను బోధించేవారు. ఆయన వద్ద చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు నేడు సమాజంలో సమున్నత స్థానాల్లో ఉన్నారు. అనేకమంది పిహెచ్‌డీలు కూడా చేశారు. ఆయన రిటైరయ్యాక కూడా విశ్రాంతి అనేది లేకుండా నెల్లూరులోని వర్ధమాన సమాజం, సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో దాదాపు రెండు దశాబ్దాలకు పైగానే వందలాదిగా సారస్వతోపన్యాసాలు చేసి ప్రజల్లో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించారు. ‘పురాణ ప్రవచన సుధాకర’, ‘గురుప్రపూర్ణ’ వంటి పలు విశిష్టమైన బిరుదులు కూడా ఆయన్ను వరించాయి. రామాయణం, మహాభారతం, భాగవత ప్రవచనాల్లో ఆయన ఎంతో ప్రసిద్ధులు. పలు గ్రంథాలను కూడా ఆయన రచించారు. మహాకవి తిక్కన రచించిన భారతంలోని భగవద్గీతకు అర్థ తాత్పర్యాలను అద్భుతంగా రచించడమే కాక పోతన భాగవతంలోని ‘రుక్మిణీ కల్యాణం’ ఘట్టాన్ని ప్రత్యేకంగా పుస్తక రూపంలో ముద్రించి సాహితీలోకానికి అందజేశారు. నెల్లూరులోని పద్య కళా పరిషత్ కార్యదర్శిగా ఉంటూ పలు సాహితీ కార్యక్రమాలను నిర్వర్తించారని, ఆయనతో పాటు తాను కూడా చదువుకుని, ఆయనతో కలసి విఆర్‌సిలో అధ్యాపకునిగా పనిచేశానని, తనకెంతో ఆప్తమిత్రుడైన వేణుగోపాలయ్య లేకపోవడం ఎంతో బాధాకరమని, స్వతహాగా సౌమ్యుడు, సౌజన్యమూర్తి అయిన వేణుగోపాలయ్య మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ తన ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, విఆర్‌సి విశ్రాంత అధ్యాపకుడు..మోపూరు వేణుగోపాలయ్య ప్రియశిష్యుడు కొండా వెంకటస్వామి, ప్రపంచ తెలుగుసమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడులతో పాటు సరస్వతీసమాజం నిర్వాహకులు, నగరంలోని అనేకమంది సాహితీవేత్తలు ఆయన మృతికి విచారం వ్యక్తం చేశారు. ఆయన లేకపోవడం సాహితీరంగానికే తీరని లోటంటూ బాధను వ్యక్తం చేస్తూ, వేణుగోపాలయ్య కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## ఆయన జీవితం.. ఆదర్శప్రాయం

### - ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంతాపం

విఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకులు మోపూరు వేణుగోపాలయ్య మృతి బాధాకరమని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఒక సంతాప సందేశంలో విచారం వ్యక్తం చేశారు. వేణుగోపాలయ్య ఎంతో సౌమ్యులని, విద్యార్థుల పట్ల బాగా అభిమానం చూపేవారని, అధ్యాపక వృత్తి పట్ల అంకితభావం, క్రమశిక్షణ, దేశభక్తితో కూడిన ఆయన జీవితం యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ ఆయన కుటుంబసభ్యులకు తన సానుభూతిని ప్రకటించారు.

# పెన్నానదిని తవ్విపారేస్తున్నారు

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

నెల్లూరుసీమ ప్రజలకు ప్రాణదాతగా ఉన్న పెన్నానదిని ఇప్పుడు కొందరు ఇసుక తవ్వకాల పేరుతో అడ్డదిడ్డంగా తవ్విపారేస్తున్నారు. దీంతో పెన్నానది అంతా లోతైన గుంతలతో నిండిపోతోంది. నెల్లూరు నుంచి సోమశిల దాకా నిరంతరం ఒక్కక్షణం కూడా ఏమారకుండా రాత్రనక పగలనక నదిని తవ్వేస్తుండడం లారీల కొద్దీ ఇసుకను తరలించుకుపోతుండడం చూసి ‘మరీ ఇంత స్వార్థమా..ఇంత దురాశా’.. అంటూ గ్రామీణప్రాంతాల ప్రజలు విస్తుపోతున్నారు. గతంలో ప్రభుత్వం అనుమతించిన ఇసుక రీచ్‌లలో కూలీలను నదిలోకి దింపి ఇసుక తవ్వితీసుకువచ్చిన తర్వాత లారీల్లో నింపే వారు. దీంతో ఎంతోమంది కూలీలకు, కష్టజీవులకు ఉపాధి కలిగేది. ఇప్పుడదంతా పోయింది. ఎవరి స్వార్థం వారిది. ఎవరి ధనార్జన వారిది అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అందరూ కరోనాతో తల్లడిల్లిపోతుంటే కొందరు మాత్రం ఇంతకన్నా మంచి సమయం ఇంక రాదని ధనార్జనే ధ్యేయంగా ఇసుకను కొల్లగొట్టుకుపోతున్నారు. నేరుగా పెద్దపెద్ద జేసీబీలనే తీసుకువచ్చి నదిలోకి దింపి ఇష్టం వచ్చినట్లుగా ఎక్కడంటే అక్కడంతా ఇసుకను తవ్వేసుకుని పోతున్నారంటూ గ్రామాల్లోని జనాల్లో గగ్గోలుగా ఉంది.

ఇదంతా అందరికీ తెలిసిన విషయమే. అంతా బహిరంగ రహస్యమే. అయినా పట్టించుకొనేవారు లేరు... నదుల్ని రక్షించే నాధులెవరున్నారని?.. ఇలా అడ్డదిడ్డంగా నదుల్ని తవ్వేయడం వల్ల పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందని ఎవరైనా చెప్తే.. అది నవ్వులాటగా మారుతోంది. దీనివల్ల భూగర్భజలాల నీటిమట్టం అడుగంటిపోయి నదీ పరీవాహకప్రాంతాల్లో పండుతున్న పంటలకు భవిష్య త్తులో నీళ్ళు చుక్క కూడా దొరకని గడ్డు పరిస్థితులు ఏర్పడతాయి. అటు కూలీల నోళ్లు కొట్టి, ఇటు రైతుల కడుపుకొట్టి, ఇంకోవైపు సాగునీళ్ళు తాగునీళ్ళు ఇస్తున్న పెన్నానదికి గుంతలు పెట్టి ఇసుకను చిత్తం వచ్చిన రీతిగా తవ్వి తీసుకుపోతుంటే..నెల్లూరు నుంచి సోమశిల దాకా ఉన్న అనేక రీచ్‌ల్లోంచి రోజూ వేలాది లారీల్లో ఇసుకను తరలించుకుపోతుంటే..ఇంక కొద్దికాలానికి నెల్లూరు పెన్నానదిని మ్యాపుల్లో చూసుకోవాల్సిందే తప్ప కంటికి కూడా కనిపించదేమో!.. అధికారులు, ప్రభుత్వాలు అన్నీ ఇసుక తవ్వకాలకే అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తుంటే.. ఎవరు మాత్రం ఏం చేయగలరు?.. మనుషులకే రక్షణ లేదు.. ఇక నదుల్ని కాపాడేదెవరు?.. డబ్బు పిశాచి అట్లా ఆడిస్తోంది మనుషుల్ని..ఈ దుర్భర పరిస్థితులు ఎప్పుడు పోతాయో ఏమో..ఆ దేవుడికే తెలియాలి.

ఎల్‌బిటి వెంకటవీరరాఘవయ్య, సోమశిల.

# ఆరోగ్యం ఎలా ఉంది?.. వసతులు ఎలా ఉన్నాయి?..

## కరోనా రోగుల వద్దకు వెళ్ళి మాట్లాడిన మంత్రి మేకపాటి



రాష్ట్ర భారీపరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి తన సొంత నియోజవర్గమైన ఆత్మకూరులో ఈనెల 1న పర్యటించి టిడ్కో భవనంలో నిర్వహిస్తున్న కోవిడ్ కేర్ సెంటర్‌లోని బాధితుల గదుల వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితుల్ని, వారికి అందుతున్న వైద్య సదుపాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్ళి అక్కడ రోగులకు అందుతున్న చికిత్సలను, ఇతర వసతులను పరిశీలించారు. ఈ వైద్యశాల ప్రాంగణంలో ప్రముఖ సినీనటుడు సోనూసూద్ ఏర్పాటుచేయనున్న ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణ ప్రాంతాన్ని మంత్రి సందర్శించారు. రాష్ట్రంలో సోనూసూద్ ఏర్పాటుచేయనున్న రెండు ఆక్సిజన్ ప్లాంట్‌లలో ఒకటి ఆత్మకూరులో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. ఆత్మకూరు కోవిడ్ సెంటర్‌లో అధికారులు, వైద్యులు ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని మంత్రి ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఆత్మకూరు మునిసిపాలిటీ.. తొలి సమావేశం

- ప్రధాన సమస్యలను చర్చించిన కౌన్సిల్



ఆత్మకూరు మునిసిపాలిటీ తొలి కౌన్సిల్ సమావేశం గతనెల 31న జరిగింది. మునిసిపాలిటీ పాలకవర్గం ఏర్పడి ప్రమాణస్వీకారం నిర్వహించిన అనంతరం తిరుపతి పార్లమెంట్ ఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో ఆ సమావేశం నిర్వహించలేదు. మునిసిపాల్ ఛైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 23 వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మెన్‌లతో కలసి 21 మంది వైకాపాకు చెందిన వారుకాగా, ఇద్దరు టిడిపి కౌన్సిలర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. మొదట మునిసిపాలిటీలోని మూడు కోఆప్షన్ మెంబర్ల ఎన్నికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మునిసిపాల్టీలోని ప్రధాన సమస్యలను చర్చించి పలు అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు, వైస్ ఛైర్మెన్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆనందయ్యకు అండగా ఉంటాం

**- ఎంపీ మాగుంట శీనయ్య**



కరోనా నివారణకు ఆనందయ్య తయారుచేసిన మందుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభిస్తోందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆనందయ్య మందు తయారీకి మాగుంట కుటుంబం అండగా ఉంటుందని చెప్పారు. ఈనెల 1న ఆయన కృష్ణపట్నంకు వచ్చి ఆనందయ్యను ఘనంగా సత్కరించారు. ప్రకాశం జిల్లాలోని నల్లమల అడవుల నుంచి ఆ మందు తయారీకి అవసరమైన వనమూలికలను సేకరించి పంపిస్తామని అంటూ ప్రకాశం జిల్లా ప్రజలకు కూడా మందు ఇవ్వాలని ఆనందయ్యను కోరారు. ఈనెల 1న ఆయన ఆనందయ్యను కలసి ఆత్మీయంగా సన్మానించారు. ఆనందయ్య ఇస్తున్న సంప్రదాయసిద్ధమైన మందుతో ప్రకాశం జిల్లాలో అనేకమంది బాధితులు కరోనా నుంచి బయటపడ్డారని అంటూ ఆనందయ్య త్వరలో ఒంగోలుకు కూడా వచ్చి మందు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కరోనా నివారణకు తాను ఇస్తున్న ఆయుర్వేదమందును కృష్ణపట్నంలో తయారుచేయడం జరుగుతుందని, అయితే అక్కడ పంపిణీ ఉండదు కనుక ఆ మందు కోసం ఎవరూ కృష్ణపట్నం రావొద్దని ఆనందయ్య ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తాను తయారుచేసిన ఈ మందుకు ప్రభుత్వం ద్వారా అనుమతులు వచ్చేందుకు సహకరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లాకు చెందిన మంత్రులకు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

# అన్నదానం

నెల్లూరులోని చిన్న బాలయ్యనగర్‌లో ఉన్న పేదలకు ఇటీవల స్థానిక అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిలక్, అర్చనల పెళ్ళి వేడుకను పురస్కరించుకుని అన్నదానం చేశారు. యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, అమల, ప్రతాప్, కల్యాణి పాల్గొన్నారు.




## కరోనా బాధితులకు..

# బీద మస్తాన్‌రావు మానవీయ సేవలు

- బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..250 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ల వితరణ





జిల్లాలోని బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్, బిఎంఆర్ గ్రూప్ పరిశ్రమల అధినేత, ప్రముఖ వైకాపా నాయకులు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు తన బిఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోవిడ్ బాధితులకు 250 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందజేసి తన మానవీయతను చాటుకున్నారు. గత నెల 29న ఆయన నెల్లూరులోని జడ్పీ హాల్‌లో రాష్ట్ర మంత్రులు డాక్టర్ అనిల్. మేకపాటి గౌతంరెడ్డిల సమక్షంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు 5 లీటర్లవి 200, 10 లీటర్ల ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు మరో 50 అందజేశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో బిఎంఆర్ ట్రస్ట్ సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి ఈ వితరణ చేయడం అభినందనీయమని, బీద మస్తాన్‌రావు సహృదయంతో తమ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రస్తుత కోవిడ్ పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలను నిలబెట్టేందుకు తక్షణం కావాల్సిన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను విరాళంగా అందివ్వడం ఎంతో సంతోషకరమని మంత్రి అనిల్ కొనియాడారు. కరోనా కేసులు క్రమేణా తగ్గుముఖం పడుతున్నాయని, అధికారయంత్రాంగం ఇదేవిధంగా మరో రెండుమూడు వారాలు కష్టపడి పనిచేస్తే జిల్లాలో కోవిడ్ పూర్తిగా నియంత్రణలోకి వస్తుందన్నారు.

### 2 డీజీ మందును కొనుగోలు చేసి అందిస్తాం

**– బీద మస్తాన్‌రావు**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ ఈ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను చైనా నుంచి తెప్పించామని, రానున్న రోజుల్లో జిల్లాలో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. డిఆర్‌డిఓ ఛైర్మెన్, నెల్లూరు జిల్లా వాసి.. మన సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో తయారైన 2 డీజీ మందును బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్, ఇతర పరిశ్రమల యాజమాన్యాల సహకారంతో కొనుగోలు చేస్తామని, కోవిడ్ బాధితుల సౌకర్యార్థం ఆ మందును ఎక్కువగా కొని జిల్లా యంత్రాంగానికి అందజేస్తామని చెప్పారు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ కరోనా బాధితుల కోసం బీద మస్తాన్‌రావు చేస్తున్న వితరణ ఎంతో అభినందనీయమైనదన్నారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆఫ్కాబ్ ఛైర్మెన్ అనిల్‌బాబు, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, జడ్పీ సిఇఓ సుశీల తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా జైలుకు.. 10ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు

నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో ఖైదీలు ఎవరైనా కరోనా బారినపడితే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉండేందుకు 10అక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను బిఎంఆర్ ట్రస్టు వారు గతనెల 31న జిల్లా జైలు సూపరింటెండెంట్ కె.రాజేశ్వరరావుకు అందజేసి తమ మానవీయతను చాటుకున్నారు. బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి అనిల్‌తో పాటు జైలుశాఖ డెప్యూటీ సూపరింటెండెంట్లు శ్రీకాంతరాజ్, మహేష్ బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసన్న, జైలర్లు తదితరులు పాల్గొని బీద మస్తాన్ రావు సేవలను కొనియాడారు.

## సచివాలయ సిబ్బందికి..

# శ్రీనివాస సేవా ట్రస్ట్ వితరణ

వెంకటగిరిలోని శ్రీ శ్రీనివాస సేవా ట్రస్ట్ వారు ఇటీవల సచివాలయ సిబ్బందికి మాస్కులు, పిపిఇ కిట్లు, శానిటైజర్లను పంపిణీ చేశారు. పట్టణ వైకాపా నాయకుడు ఢిల్లీబాబు చేతులమీదుగా వాటిని అందరికీ అందజేశారు. కరోనా సమయంలో ఈ ట్రస్టువారు ప్రజలకు తమ వంతు సేవలందిస్తున్నారని, గత ఏడాది కూడా కరోనా సమయంలో ఎంతోమంది బాధితులకు, పేదలకు భోజనప్యాకెట్లు అందజేశారని నాయకులు కొనియాడారు. వైకాపా నాయకులు చింతపట్ల మురళీకృష్ణ, శ్రీనివాసులు, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేతకారులకు

# చేయూతనివ్వాలి


### ప్రభుత్వాన్ని కోరిన రాష్ట్ర పద్మశాలి సంఘం నేత

ఈ కరోనా కష్టకాలంలో చేనేతకారులు ఉపాధి లేక అవస్తలు పడుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ కెఎస్ చక్రధారి కోరారు. ఇటీవల ఆయన నెల్లూరులోని ఆ సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేతపై ఆధారపడి సుమారు 4లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, కరోనా నేపథ్యంలో నేతవస్త్రాలకు డిమాండ్ లేక, మార్కెటింగ్ సౌకర్యాలు లేక, వస్త్రాల తయారీకి ముడి సరుకులు కూడా లభించక చేనేతకారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే చేనేతకారులకు గుర్తింపుకార్డుతో సంబంధం లేకుండా మగ్గం ఉన్న ప్రతి నేత కుటుంబానికి, వారి అనుబంధ వృత్తిదారులకు 5వేల రూపాయలతో పాటు 50 కిలోల బియ్యం, గ్యాస్ సిలిండర్‌ను జీవన భృతి కింద ఇవ్వాలని, 'నేతన్న నేస్తం' పథకాన్ని వెంటనే అమలుచేసి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## చేనేత, జౌళి శాఖ అధికారిగా

# ఆనంద్‌కుమార్

జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకునిగా ఇటీవల ఆనంద్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. కాకినాడలోని ఆ శాఖ ఏ.డి కార్యాలయంలో అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై నెల్లూరులో నియమితులయ్యారు.

### ఆనందోత్సాహాల మధ్య
# ఆల్తూరు వారి నిశ్చితార్థ వేడుక




ఆధ్యాత్మిక సారధులు ఆల్తూరు వారి ఇంట పెళ్లి గంట మోగింది. కీర్తిశేషులు ఆదినారాయణరెడ్డి మనుమరాలు **సాహిని - అనురాగ్**ల వివాహ నిశ్చితార్ధం మే 30వతేదీ ఆదివారం హైదరాబాదులోని వధువు చిన్నాన్న ఆల్తూరు మహేష్‌రెడ్డి ఇంట్లో వైభవంగా జరిగింది. వధువు నానమ్మ సులోచనమ్మ, అమ్మానాన్నలు గిరీష్‌రెడ్డి-లతలతో పాటు బాబాయ్ మహేష్‌రెడ్డి పిన్ని రాధికతో సహా వధువు బంధు





మిత్రులు ఈ వేడుకలో పాల్గొన్నారు. వరుడి అమ్మానాన్నలు వెంకటేశ్వర రెడ్డి-సరితలతో పాటు వారి వైపు నుండి కూడా పరిమిత సంఖ్యలో బంధువులు ఈ సంబరంలో పాలు పంచుకున్నారు. సినీ నటులు చిరంజీవి, నాగార్జున, వెంకటేష్, మోహన్‌బాబు, శ్రీకాంత్, రాంచరణ్‌లు కాబోయే దంపతులను దీవించారు. రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులతోపాటు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దానం నాగేంద్ర, జె.సి.దివాకర్ రెడ్డి, ఆర్.శ్రీనివాసులరెడ్డి(వాసు), ఇందు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ఇంకా పలువురు రాజకీయ, సినీ, పారిశ్రామిక ప్రముఖులు పరిమిత సంఖ్యలో విచ్చేసి సాహిని - అనురాగ్‌లను దీవించారు. 2021, ఆగస్టు 18 వీరి కళ్యాణ వైభవానికి ముహూర్తం నిర్ణయించారు.

# సమాచార శాఖ డి.డిగా వెంకటేశ్వరప్రసాద్



జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డెప్యూటి డైరెక్టర్‌గా ఎం.వెంకటేశ్వర ప్రసాద్ గతనెల 31న నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. రెండేళ్ళ క్రితం ఆయన ఇక్కడే డి.డిగా పనిచేసి అమరావతికి బదిలీపై వెళ్ళగా ఆయన స్థానంలో డిపిఆర్ఓ దమయంతి ఇన్‌చార్జి డి.డిగా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ వెంకటేశ్వరప్రసాద్‌ను ప్రభుత్వం ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ చక్రధర్‌బాబును, జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, బాపిరెడ్డిలను గౌరవపూర్వకరంగా కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

# సమాచారశాఖ ఉద్యోగి.. రామిరెడ్డికి ఆత్మీయ సన్మానం

జిల్లా పౌరసంబంధ శాఖ టెక్నికల్ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌వి రామిరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా గతనెల 31న నెల్లూరులోని ఆ శాఖ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది రామిరెడ్డి దంపతులను ఆత్మీయంగా సన్మానించారు. రామిరెడ్డి సేవలను కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో డి.డి వెంకటేశ్వరప్రసాద్‌తో పాటు డిపిఆర్ఓ దమయంతి, కిషోర్ , ఏపిఆర్ఓలు రవికుమార్, రమేష్ పాల్గొన్నారు.

## కొత్త ఇంజనీర్‌గా కిషోర్

సమాచారశాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్‌గా ఉద్యోగ విరమణ చేసిన రామిరెడ్డి స్థానంలో కొత్త ఇంజనీర్‌గా ఏ. కిషోర్ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 1న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును గౌరవపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# జిల్లా సహకార శాఖ అధికారిగా సాయికృష్ణుడు



జిల్లా సహకారశాఖ అధికారి(డిసిఓ)గా ఎం. సాయికృష్ణుడు నియమితులయ్యారు. గుంటూరులో స్పెషల్ కేటగిరీ డెప్యూటి రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం పదోన్నతినిచ్చి నెల్లూరుజిల్లా అధికారిగా నియమించింది. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ చక్రధర్‌బాబును మర్యాదపూర్వకం కలిశారు.



# అదరగొడుతున్న ఎండలు



ఈ వేసవికాలంలో ఎండలు అదరగొట్టేస్తున్నాయి. ఒక వైపు భానుడి భగ భగ.. మరోవైపు ఒకటే సెగ.. జనం తట్టుకోలేకపోతున్నారు. ఉదయం 7 గంటలు కూడా కాకముందే సూర్యుడు తన ప్రతాపం చూపుతుండడంతో మధ్యాహ్నానికి ఎండలు నిప్పులు కురిపిస్తున్నట్లుగా ఉంటున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటనే భయపడుతున్నారు. గత కొద్దిరోజులుగా ఎండ తీవ్రత 40 డిగ్రీలకు పైగానే పెరుగుతుండడంతో ఈ మిడిమేళపు ఎండల్ని చూసి జిల్లా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే చాలు, సాయంత్రం 6 గంటల దాకా నగరంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. ఒకవైపు ఎండలు, మరోవైపు కరోనా దెబ్బతో కర్ఫ్యూ.. జనం లేక వీధులు బోసిపోయినట్లున్నాయి. ఈ ఎండలెప్పుడు తగ్గుతాయో దేవుడా అనుకుంటూ ప్రజలు చల్లని వాన వాతావరణం కోసం ఎదురుచూస్తున్నారు.

## 45 ఏళ్ళు నిండిన వారంతా
# టీకా వేయించుకోవాలి

**- కార్పొరేషన్ కమిషనర్**

కరోనా మహమ్మారి వ్యాధిని నియంత్రించేందుకు టీకా దివ్యౌషధమని, 45 ఏళ్ళు నిండిన వారంతా తొలిడోసు టీకాను తప్పనిసరిగా వేయించుకుని ఆ వ్యాధిని నివారించేందుకు సహకరించాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 9 ఆరోగ్య కేంద్రాల్లో కోవిషీల్డ్ టీకా వేస్తున్నారని తెలిపారు. నగరంలోని దండువారివీధి, జడ్పీ కాలనీ, రాజాగారి వీధి, గిడ్డంగివీధి, మహాత్మాగాంధీనగర్, వెంగమాంబవీధి, చంద్రమౌళినగర్, రామాలయం వీధి, రామయ్య వీధి ప్రాంతాల్లోని ఆరోగ్యకేంద్రాల్లో టీకా కార్యక్రమం జరుగుతోందని తెలియజేశారు.

# డెంగ్యూతో జాగ్రత్త

ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో డెంగ్యూ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, కనుక ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఈ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కొడవలూరు పిహెచ్‌సి వైద్యాధికారి స్వాతి సూచించారు. ఇటీవల ఆమె డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కొడవలూరులో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ళ చుట్టూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎస్ ఎస్తేరమ్మ, హెచ్‌వి సఫీఉద్దీన్, ఏఎన్‌ఎంలు శేషుబాయి, నదియా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## బ్రేక్స్ ఇండియా కంపెనీ..
# ఆక్సిజన్ వితరణ

బ్రేక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు కరోనా బాధితుల కోసం ఇటీవల 5 ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లను వితరణగా అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. వాటిని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు అందజేశారు. ఆ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్, జి.ఎం అరుణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## గిరిజనులకు
# 'స్పందన' సాయం

నెల్లూరు, చింతారెడ్డిపాళెం చెరువు కట్టపై నివసిస్తున్న నిరుపేద గిరిజనులు 28 కుటుంబాల వారికి ఇటీవల స్థానిక 'స్పందన' ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. కరోనా నేపథ్యంలో కూలినాలి పనులు చేసుకునే పేద గిరిజనులకు ఉపాధి కరువైందని, వారికి తమవంతు సేవగా ఈ కార్యక్రమం నిర్వహించామని సొసైటీ అధ్యక్షుడు జె.మాణిక్యరావు, కార్యదర్శి కె.రఘునాథ్, కార్యవర్గ సభ్యులు తెలిపారు.

# పొగ తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో ముప్పు

## పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్న డిఎంఅండ్‌హెచ్‌ఓ

ఆరోగ్యానికి హానికరమైన పొగాకు ఉత్పత్తులకు అందరూ దూరంగా ఉండాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం సందర్భంగా గతనెల 31న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పొగ తాగడంవల్ల గుండెజబ్బులతో పాటు శ్వాసకోస సమస్యలు, మధుమేహం, మతిమరుపు వంటి ఎన్నోరకాల వ్యాధులు వస్తాయని, ఈ దురలవాటు వల్ల ఏటా లక్షలాదిమంది మరణిస్తున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ 'పొగ తాగడం నుంచి నిష్క్రమిద్దాం' అంటూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇచ్చిన నినాదానికి కట్టుబడి ఉంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఏడిఎంహెచ్‌ఓ స్వర్ణలత, డిఎన్‌ఎంఓ పవిత్ర, వైద్యులు ఉమా మహేశ్వరి, అమరేంద్రనాథ్‌రెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రులున్నా.. వసతులు సున్నా

**- బిజెపి నాయకుల విమర్శ**

కరోనా కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, జిల్లాలోని వెంకటగిరి, రాపూరు తదితర ప్రాంతాల్లో ఆసుపత్రులు ఉన్నా వాటిలో వసతులు మాత్రం శూన్యమని వెంకటగిరి నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జి ఎస్‌ఎస్‌ఆర్ నాయుడు విమర్శించారు. గతనెల 30న ఆయన వెంకటగిరిలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కరోనా నివారణకు కేంద్ర ప్రభుత్వం నిధులు పంపుతున్నా వాటిని ఇతర కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారని, ఇకనైనా కరోనా నియంత్రణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. వడ్లమూడి భాస్కర్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకోవాలి

**- బిటిఏ నాయకుల వినతి**

ఉపాధ్యాయులను ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తించి ఆదుకోవాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బిటిఏ) నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. జూమ్ యాప్ ద్వారా గతనెల 30న నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కరోనాతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 550 మంది ఉపాధ్యాయులు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలకు 50 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలన్నారు. బిటిఏ రాష్ట్ర నాయకులు ఆదినారాయణ, వెంకట్రావు, పి.రామకృష్ణ, జిల్లా శాఖ అధ్యక్షుడు ఎంఆర్ చక్రవర్తి, ఎం.ముసలయ్య, జి.ఆంజనేయులు, ఎం.ప్రసాద్, కె.రవి, రమేష్ పాల్గొన్నారు.




కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

40 లాయర్ YEARS

నాలుగు దశాబ్దాలుగా అలసిపోని పయనం
పోరాటాలలో మడమ తిప్పని గమనం
లాయర్
వారపత్రికకు
40వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.

Dr.N.Satyanarayana & G.Krishnamohan's
VISWASAI
NELLORE & TIRUPATI

## కరోనాతో తల్లిదండ్రులు మృతిచెంది..
# అనాథలైన పిల్లలకు 10 లక్షల డిపాజిట్

### దరఖాస్తు చేసుకోవాలంటున్న అధికారులు

కరోనా మహమ్మారి వ్యాధి వల్ల తల్లి దండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలను ఆదుకునేందుకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. కరోనాతో తల్లి దండ్రులు మరణించినా, లేదా వారిలో ఒకరు అంతకుముందే మరణించి, ఇప్పుడు కరోనా కారణంగా మరొకరు చనిపోయిన వారి పిల్లలకు 10 లక్షల రూపాయలను ఎక్స్‌గ్రేషియాగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. దరఖాస్తు తేదీ నాటికి వారి పిల్లల వయస్సు 18సంవత్సరాలలోపు ఉండాలని, కుటుంబ ఆదాయం దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వాళ్ళు ఈ సాయానికి అర్హులని, కోవిడ్ పాజిటివ్ రిపోర్టును విధిగా చూపించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రోజ్‌మాండ్ ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. 10 లక్షల రూపా యల ఎక్స్‌గ్రేషియాను అర్హులైన పిల్లల పేరుతో ఏదైనా జాతీయబ్యాంకులో డిపా జిట్ చేసి, వారికి బాండ్ అందజేస్తామని, పిల్లలకు 25ఏళ్ళు నిండాక మాత్రమే డిపాజిట్ డబ్బులు తీసుకునే వీలు ఉం టుందని, డిపాజిట్‌పై వచ్చే వడ్డీని నెల వారీగా కానీ, మూడు నెలలకోసారి కానీ తీసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఐసిడిఎస్ అధికారి, లేదా ఆయా సిడిపిఓ కార్యాలయాల్లో సంప్రదిం చాలని కోరారు.

## నిరుపేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు



కరోనా నేపథ్యంలో జీవనానికి ఇబ్బం దులు పడుతున్న 80 మంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నెల్లూరులోని బ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రాల సంఘం, గోవిందా గోవిందా వాట్సాప్ గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. గతనెల 30న భక్తవత్సలనగర్‌లో ఆ సంఘ కార్యాలయంలో సభ్యులందరి వితరణతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు మంచెళ్ళ కామేశ్వరప్రసాద్, నిర్వాహకులు జెవిహెచ్ నాగేశ్వరరావు, ఎంవిఎస్ ప్రసాద్, డిసి కామేశ్వరరావు, వి.గోపీనాథ్‌స్వామి, ఇ. నరసింహారావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో
# స్వల్ప భూప్రకంపనలు

ఉదయగిరి నియోజకవర్గంలోని వరి కుంటపాడు, దుత్తలూరు మండలాల్లోని పలు ప్రాంతాల్లో గతనెల 30వ తేది మధ్యాహ్నం 1.48 గంటల ప్రాంతంలో స్వల్పంగా భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనలు చెందారు. మంచాల మీద, కుర్చీలమీద కూర్చున్నవారికి ఉన్న ట్లుండి తమనెవరో కదిలించినట్లయి భయంతో ఉలిక్కిపడ్డారు. వరికుంటపాడు మండలంలోని తూర్పు బోయమడుగుల, కనియంపాడు, జడదేవి తదిర ప్రాంతాల్లో ఈ ప్రకంపనలు రావడంతో ప్రజలు ఆం దోళన చెందారు. తొలుత ఏదో పెద్దశబ్దం వినిపించిందని, వెనువెంటనే భూమి కం పించిందని స్థానికులు తెలిపారు. అయితే ఈ ప్రకంపనలతో ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. గతంలో 1988 ప్రాంతంలో కూడా వరికుంటపాడు, చాకలికొండ ప్రాంతాల్లో ఇలాంటి స్వల్ప భూ ప్రకంప నలు జరిగాయని వారు చెప్తున్నారు.

## యాచకులకు ఆహారం

కేంద్రంలో ప్రధాని మోడీ పాలన రెండోసారి ప్రారంభమై రెండేళ్ల పూర్తయిన సందర్భంగా గతనెల 30న నెల్లూరు నగ రంలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, ధర్మరాజస్వామి దేవాలయం తదితర ప్రాంతాల్లో ఉన్న యాచకులకు స్థానిక బిజెపి నాయకుడు మిడతల రమేష్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆహార పొట్లాలు అందజేశారు. శ్రీకృష్ణ, సంధ్య, మహాలక్ష్మి, సుబ్బయ్య పాల్గొన్నారు.

# మాట తప్పని జననేత.. జగనన్న

### ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెర వేరుస్తూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తూ ప్రజలందరి ఆదరాభిమానాలు పొందుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న మాట తప్పని ప్రజానేతగా ప్రజలందరి ప్రశంసలు అందుకుంటున్నారని సూళ్ళూరు పేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయిన సందర్భాన్ని పురస్క రించుకుని గతనెల 30న నాయుడు పేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా వంటి విపత్తు సమ యంలోనూ ప్రజలకు ఇచ్చిన వాగ్దాలన్నీ ముఖ్యమంత్రి జగన్ అమలుచేస్తున్నారని, పేదలు బడుగు బలహీనవర్గాల పట్ల మరింత శ్రద్ధచూపుతూ నిరంతరం వారి అభ్యున్నతి కోసం కృషిచేస్తున్నారని ఆయన కొనియాడారు. తొలుత ఆయన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆర్అండ్‌బి అతిథిగృహం వద్ద కేకు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు నిత్యావసర సరుకులు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ చేతుల మీదుగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కరోనా కష్టకాలంలో ఎంతోమంది పేద ఆర్యవైశ్యులు కుటుంబాలను పోషించుకోలేక అనేక అవస్థలు పడుతున్నారని, వారికి తమవంతు సాయంగా నిత్యావసర సరుకులు అందజేశామని ఆయన పేర్కొన్నారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఆర్యవైశ్య ప్రముఖులు చలువాది శరణ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఎన్టీఆర్ ఆశయసాధనకు కృషిచేద్దాం

## నందమూరి జయంతి వేడుకల్లో నాయకులు



సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్ళు అంటూ ఎంతో ఉన్నతమైన ఆశయాలతో సమాజాభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి రాజకీయరంగంలోనే ప్రాంతీయపార్టీలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన మహానేత, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయసాధనకు అందరం కృషిచేద్దామంటూ నెల్లూరులోని టిడిపి నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల ఎన్టీఆర్ 98వ జయంతి సందర్భంగా నగరంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో జిల్లాకు చెందిన పలువురు టిడిపి నాయకులు పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచ ప్రజలకు చాటిన మహానేత ఎన్టీఆర్ అని అన్నారు. ముఖ్యంగా పేదలంటే ఎన్టీఆర్‌కు ప్రాణమని, పేద బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసిన ఘనత ఆయనదేనని అన్నారు. ఎన్టీఆర్ సేవలు సదా చిరస్మరణీయమన్నారు. మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, టిడిపి నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెన్ని రమణయ్య, జలదంకి సుధాకర్, పిట్టి సత్యనాగేశ్వరరావు పాల్గొన్నారు.

# అన్నదాన పథకానికి లక్ష విరాళం

నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దేవాలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి శాంతినగర్‌కు చెందిన పగడాల రాజేశ్వరరావు తల్లిదండ్రులు ఆదిత్య, శారదలు లక్షా నూట పదహారు రూపాయలను విరాళంగా చెక్కురూపంలో ఇటీవల ఆలయ ఇ.ఓ వి.శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

## నెల్లూరు కబుర్లు

### పెద్దాసుపత్రిలో...

# ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం

- భూమిపూజ చేసిన మంత్రులు గౌతంరెడ్డి, అనిల్



నెల్లూరులోని పెద్దాసుపత్రి ప్రాంగణంలో ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి గతనెల 30న రాష్ట్ర మంత్రులు మేకపాటి గౌతంరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్‌లు భూమిపూజ చేశారు. 1.20 కోట్ల వ్యయంతో వెయ్యి ఎల్‌పిఎం సామర్థ్యంతో ఈ ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ కరోనా వ్యాధి నివారణకు చేపట్టిన కృషిలో భాగంగా రాష్ట్రంలో 64 ఆక్సిజన్ ప్లాంట్‌ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించి నిధులను కూడా మంజూరు చేశారని, ఆక్సిజన్ కోసం కరోనా బాధితులు ఇటీవల పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆక్సిజన్ కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి సంకల్పించారన్నారు. త్వరలోనే ఆక్సిజన్ మిగులు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారుతుందని భోరోసా వ్యక్తం చేశారు. జిల్లాలో నెల్లూరు నగరంతో పాటు గూడూరు, కావలి, ఆత్మకూరు ప్రాంతాల్లోనూ ఆక్సిజన్ ప్లాంట్ నిర్మాణానికి రంగం సిద్ధమైందన్నారు. కోవిడ్ వంటి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ ఆక్సిజన్ ప్లాంట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కరోనా కట్టడిలో దేశంలోనే మన రాష్ట్రం ప్రధమస్థానంలో ఉందన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### కోవిడ్ నివారణకు..

# టీకా ఒక్కటే మార్గం

**- జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్**




కోవిడ్ నివారణకు టీకా వేయించుకోవడం ఎంతో సురక్షితమని, కరోనా బారిన పడకుండా ఉండేందుకు టీకా ఒక్కటే సరైన మార్గమని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ స్పష్టం చేశారు.. 45 ఏళ్ళు దాటిన వారికి జిల్లా పోలీస్ కార్యాలయంలో తొలి డోసు వ్యాక్సిన్ వేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యులు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. టీకాపై ఎవరికీ ఎలాంటి ఆపోహలు వద్దన్నారు. ఇప్పటికే పోలీసు సిబ్బంది అందరికీ వ్యాక్సిన్ వేయించామని, వారి కుటుంబాల్లో 45 ఏళ్ళు దాటిన ప్రతిఒక్కరికీ వ్యాక్సిన్ వేస్తున్నారని, అందరూ టీకా వేయించుకుని సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆయన కోరారు.

# పోలీసు కుటుంబానికి అండగా ఉంటాం

**- ఏఎస్పీ వెంకటరత్నం**



నెల్లూరు, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రమణయ్య కరోనాతో మృతిచెందగా, ఆయన కుటుంబానికి భద్రత కింద నాలుగు లక్షల రూపాయలు మంజూరైందని ఏఎస్పీ వెంకటరత్నం చెప్పారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో రమణయ్య భార్య పద్మకు ఇటీవల అందజేశారు. విధి నిర్వహణలో ఉంటూ మృతిచెందిన పోలీసు కుటుంబాలకు తాము అన్ని విధాలుగా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఏఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లర్క్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎస్వీబిసి ఛైర్మెన్

# సాయికృష్ణ యాచేంద్ర ఔదార్యం

- లక్ష విలువైన కిట్లు, మాస్కులు పంపిణీ



సరస్వతీపుత్రుడు, సంగీత గేయధార సృష్టికర్త, ఎస్వీబిసి ఛైర్మెన్, వెంకటగిరి రాజకుటుంబీకుడు విబి సాయికృష్ణ యాచేంద్ర లక్ష రూపాయలు విలువైన మెడికల్ కిట్లు, మాస్కులు అందజేసి తమ ఔదార్యం చాటుకున్నారు. ఈ కరోనా కష్ట కాలంలో కోవిడ్ వైరస్ నిరోధానికి ఎంతో ఉపయోగకరమైన మెడికల్ కిట్లను, మాస్కులను బంగారుపేట పిహెచ్‌సి వైద్యాధికారిణి పల్లవికి అందజేశారు. వెంకటగిరి రాజా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, వెంకటగిరి రాజా వివివిఆర్‌కె యాచేంద్ర మునిమనుమరాలు శ్రీమతి ప్రశాంతి సహకారంతో వాటిని సమకూర్చారు. ప్రజలందరూ కరోనాను నివారించేందుకు కోవిడ్ నిబంధనలు పాటించాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్‌విఎం ఉన్నతపాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాఘవయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమరవాణాపై ఎస్ఇబి దాడులు

ఇసుక అక్రమరవాణాపై ఎస్ఇబి అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ వి. వెంకటేశ్వరరావు, జేడీ ఇంటలిజెన్స్ టీమ్ సుబ్బయ్య, జిలాని, వేణుగోపాల్ కలసి గతనెల 31న నెల్లూరులోని పెన్నానది వద్ద తనిఖీలు చేశారు. బోడిగాడితోట వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పెన్నానది నుంచి 9 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆ వాహనాల డ్రైవర్లిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ కోసం నవాబుపేట పోలీసులకు అప్పగించారు.

### గ్రామాల్లోనూ

# కోవిడ్ కేర్ సెంటర్లు

**- డిపిఓ ధనలక్ష్మి**

కరోనా వ్యాధితో బాధపడేవారికి వైద్య చికిత్సల నిమిత్తం గ్రామ పంచాయతీల్లోనూ కోవిడ్ కేర్ సెంటర్లు ఏర్పాటుచేసి, బాధితులకు అవసరమైన అన్ని వసతులు కలుగజేస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఓ) ధనలక్ష్మి చెప్పారు. ఇటీవల ఆమె మండల కేంద్రమైన జలదంకిలోని ఉన్నతపాఠశాలలో కోవిడ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం మండల అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో కరోనా పాజిటివ్ వచ్చినవాళ్ళు హోం ఐసొలేషన్లలో ఉండే అవకాశం లేక ఇబ్బందులు పడేవారు ఈ సెంటర్లలో చేరవచ్చుని, ప్రతిరోజూ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు బాధితులకు సంబంధించి రోజువారీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి మందులు, మంచి ఆహారం అందజేస్తారని తెలిపారు. ఇంట్లో చికిత్సలు పొందుతుంటే కొన్ని చోట్ల వారి కుటుంబసభ్యులు కూడా కోవిడ్ బారిన పడుతున్నారని, అందువల్ల గ్రామప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ఈ అవకాశం కలుగజేసిందని తెలిపారు. గ్రామాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు పాఠశాల భవనాలు, కల్యాణమండపాలు, వసతి గృహాలు వగైరాలను ఎంపిక చేసేందుకు సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎం.భాస్కర్, ఇఓ పిఆర్‌డి శ్రీదేవి, పలువురు గ్రామ సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

### వలంటీర్ల వ్యవస్థ..

# దేశానికే గర్వకారణం


> కొనియాడిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారధ్యంలో ఏర్పాటైన వలంటీర్ల వ్యవస్థ దేశానికే గర్వకారణమని, అత్యద్భుతమైన ఆ వ్యవస్థ ద్వారా ప్రజలకు సిఎం జగన్ ఎన్నో రకాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నేరుగా ప్రజల వద్దకే చేరువచేస్తూ ప్రజలనుంచి గొప్ప ఆదరణను పొందుతున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చెప్పారు. గతనెల 30న బుచ్చిరెడ్డిపాళెంలోని మండలపరిషత్ సమావేశమందిరంలో జరిగిన అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలులో వలంటీర్లదే కీలకపాత్ర అన్నారు. రాష్ట్రప్రజల శ్రేయస్సు కోసం నవరత్నాల పథకాలను అమలుచేస్తూ ముఖ్యమంత్రి చేస్తున్న కృషి అనితర సాధ్యమన్నారు. కోవిడ్‌తో మృతి చెందిన వారి అంత్యక్రియలకు 15వేలు, కోవిడ్‌తో తల్లిదండ్రులు మరణిస్తే అనాధలుగా మిగిలిన వారి బిడ్డలకు 10 లక్షల రూపాయలను సాయంగా ప్రకటించడం ముఖ్యమంత్రి మానవీయతకు నిదర్శనమన్నారు. విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూళ్లకు..'నాడు-నేడు' వెలుగులు

నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్థాయి వసతులు కలుగుతున్నాయని మనబడి నాడు-నేడు ఇన్‌చార్జి జహీర్ అహ్మద్ అన్నారు. గతనెల 31న ఆయన నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో హెడ్మాస్టర్లతో సమావేశమయ్యారు. జూన్ నెలాఖరులోగా మొదటి విడత పనులు పూర్తిచేసి, జులైలో రెండో విడత పనులు ప్రారంభించాలని ఆయన వారికి చెప్పారు. ఎంఇఓ రహీం, ఇన్‌చార్జి ఎంపిడిఓ జలజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## ఆనందయ్య మందుకు

# అనుమతి హర్షదాయకం

### - మాజీమంత్రి సోమిరెడ్డి



ఆనందయ్య మందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం హర్షదాయకమని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గతనెల 31న ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మందును పంపిణీ చేయాలని తాము తొలినుంచి కోరుతున్నామని, నెల్లూరులో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి టైమ్‌స్లాట్ ప్రకారం టోకెన్లు పంపిణీ చేయాలని, అధికార పార్టీలో ఒకరిద్దరు నాయకులు తప్ప అందరూ ఆనందయ్యకు అండగా నిలిచారని ఆయన పేర్కొన్నారు.

# ఆనందయ్యను సన్మానించిన ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు



కృష్ణపట్నం ఆయుర్వేద వైద్యుడు ఆనందయ్యను నెల్లూరులోని శుభమస్తు షాపింగ్‌మాల్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈనెల 1న జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పల్నాటి రామదండు, బయ్యా వాసు, సుభాష్, మల్లి, సుమన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఆయుర్వేద మందుతో పలువురికి ప్రాణం పోసిన ఆనందయ్యను అభినందించారు. ప్రభుత్వం, న్యాయస్థానాల అనుమతులతో ఆనందయ్య మందు త్వరలోనే అందరికీ అందుబాటులోకి రానుండడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు.

# రెడ్‌క్రాస్‌లో రక్తదానం

నెల్లూరు నగరంలోని మద్రాసు బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ఇటీవల రెడ్‌క్రాస్ రక్తనిధి కమిటీ సభ్యుడు, మహాయాగ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు లోకేష్, తమ సభ్యుల సాయంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి తన మానవీయతను చాటుకున్నారు. లోకేష్ తండ్రి 60 ఏళ్ళ వృద్ధుడు రాఘవయ్య కూడా ఈ శిబిరంలో రక్తదానం చేసి అందరి అభినందనలు అందుకున్నాడు. బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.




# పోలీసులకు ఆత్మీయ వీడ్కోలు

పోలీసుశాఖలో విశిష్టసేవలందించి ఉద్యోగ విరమణ పొందిన పలువురు పోలీసు అధికారులు, సిబ్బందికి గతనెల 31న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీసు అధికారులు ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసు సిబ్బంది సేవలను కొనియాడుతూ, వారి శేషజీవితం హాయిగా గడపాలని ఏఎస్పీ వెంకటరత్నం ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన సౌత్ ట్రాఫిక్ ఎస్ఐ కె.శంకర్‌రాజు, డిఎస్‌బి ఎస్ఐ నారాయణస్వామి, సిసిఎస్ ఎస్ఐ ఎం.రంగస్వామి, విఆర్ ఏఎస్ఐ వై.వెంకటేశ్వర్లు, బాలాజీనగర్ ఏఎస్ఐ వీరయ్య, కలిగిరి ఏఎస్ఐ ఎస్‌కె అజ్మతుల్లా, కలిగిరి హెడ్‌కానిస్టేబుల్ సిహెచ్ రామ్మూర్తి, ఎఫ్‌సిఐ హోంగార్డు ఎస్ఏ వాహెబ్, వెల్ఫేర్ వింగ్ హోంగార్డు కామేశ్వరిలను ఏఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పీ శివాజీరాజా, హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# జక్కా వెంకయ్య సేవలు మార్గదర్శకం

సిపిఎం నాయకుడు దివంగత జక్కా వెంకయ్య జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారని ఆయన సేవలు మార్గదర్శకమని వక్తలు కొనియాడారు. గతనెల 30న జక్కా వెంకయ్య మూడవ వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ జక్కా వెంకయ్య అటు పార్టీకి, ఇటు పేదలకు చేసిన సేవలు అపూర్వమన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రరాజగోపాల్, నాయకులు మూలం రమేష్, శ్రీనివాసులు, వెంకమరాజు, వెంకటేశ్వరు, జక్కా వెంకయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా నగరంలోని సిఐటియు కార్యాలయంలో నాయకులు ప్రసాద్, అజయ్‌కుమార్, ప్రసాద్, చిల్డ్రన్స్‌పార్కు వద్ద ఉన్న సిపిఎం కార్యాలయంలో నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, పెంచల నరసయ్య, నగేష్, మనోహర్, కత్తి శ్రీనివాసులు, చంద్రారెడ్డి, రఫీ అహ్మద్, నాగేశ్వరరావు, రెహనాబేగం, మస్తాన్‌బీ తదితరులు పాల్గొని జక్కా వెంకయ్య సేవలను కొనియాడారు.

# ఆశాజ్యోతి ఆనందయ్య



మందు సరే..
మందగా చేరితే
కరోనా కాటుకు
వీలు కల్పిస్తున్నామేమో
'అవసరం' తెగింపజేస్తుంది జనాన్ని
వేలు, లక్షలెక్కడ పెట్టుకుంటామని?
అల్లోపతి అభివృద్ధయ్యాక
ఆయుర్వేదంపై అశ్రద్ధ
కొత్త ఒక వింత.. పాతొక రోతన్నట్లు.
చెట్టు మందైనా, పుట్ట మందైనా,
నాటి నాటు మందైనా,
నేటి నీటు మందైనా,
పసరైనా, పొడైనా,
ఊపిరి కోసం
ఊరూరా వైద్యశాలల్లో వ్యాధిగ్రస్త ప్రజ
కార్పణ్యం లేని కార్పొ'రేటీ'కరణతో
కొనుక్కోబడుతున్న ప్రాణవాయువు..
కొనుక్కున్నా వాయువులో
కలిసిపోయే ప్రాణాలు.
పడకల వైద్య వ్యాపారంతో
ప్రత్యామ్నాయ చికిత్సకై గ్రామీణం
బెంబేలెత్తుతున్న బడుగులకు
ఆనందయ్య ఓ ఆశాజ్యోతి.
చౌరస్తాలో దిక్కులు చూసేవాడికి
తెలిసిన దారిలా...
ఎడారిలో ఒయాసిస్సనిపించిన
ఆనందయ్య!...

- వేదం సూర్యప్రకాశం
9866142006



# చంద్రబాబు మాటల్ని ఎవరూ నమ్మరు

## - ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



టిడిపి అధినేత చంద్రబాబునాయుడి మాటలను ప్రజలు ఎవరూ నమ్మరని, ప్రభుత్వంపై ఆయన చేస్తున్న విమర్శలన్నీ అర్థరహితమని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ళయిన సందర్భంగా గతనెల 30న ఉదయగిరిలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద వైకాపా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక చంద్రబాబు నాయుడు లేనిపోని విమర్శలు చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ రెండేళ్ళపాలన పట్ల పార్టీలకు, వర్గాలకు అతీతంగా ప్రజలందరూ ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సాహసోపేతమైన నిర్ణయాలతో ఎన్నోరకాలైన ప్రజాసంక్షేమ పథకాలను అమలుచేస్తూ సిఎం జగన్ రాష్ట్రంలో ప్రజలందరి అభిమానాన్ని పొందుతున్నారని కొనియాడారు. అయితే చంద్రబాబు మాత్రం జగన్ పాలన చూసి ఓర్వలేక ఎల్లోమీడియా ద్వారా తమ ప్రభుత్వంపై అనవసర విమర్శలన్నీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు షేక్ అలీఅహ్మద్, చేజర్ల సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, ఓబులరెడ్డి, గౌస్‌మొహిద్దీన్, బి.శ్రీనివాసులు, హరి తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసన



పెట్రోలు, డీజల్, నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో పేదలు, సామాన్యప్రజల జీవితాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయంటూ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గతనెల 30న నిరసన దీక్ష నిర్వహించారు. ధరలను వెంటనే నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్‌తో పాటు, నాయకులు ఫయాజ్, అల్లావుద్దీన్, గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తేదీ దాకా కర్ఫ్యూ

కరోనా కట్టడికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో జూన్ 10వ తేదీ వరకు కర్ఫ్యూను కొనసాగిస్తున్నట్లు డిఆర్‌ఓ చిన్నఓబులేసు పేర్కొన్నారు. జిల్లాలో అధికారులు, పోలీసులు తీసుకుంటున్న పటిష్టమైన చర్యలతో కర్ఫ్యూ, లాక్‌డౌన్‌లతో కరోనా కేసులు తగ్గినప్పటికీ ఇంకా ఆ మహమ్మారి వ్యాధి ప్రభావం పోలేదని, అందువల్ల కర్ఫ్యూను పొడిగిస్తున్నామని ఆయన గతనెల 31న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలంతా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ కరోనాను నివారించేందుకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 'లయన్స్' ఆక్సిజన్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోవిడ్ బాధితులకు అందజేసేందుకు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందుబాటులో ఉంచామని లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు అధ్యక్ష కార్యదర్శులు రామానుజన్, కృష్ణకుమార్‌లు తెలిపారు. ఆసుపత్రుల్లో బెడ్లు దొరక్క, డిశ్చార్జ్ అయి ఇంటి వద్ద ఇబ్బందులు పడుతున్న బాధితులకు మాత్రమే వీటిని అందజేయడం జరుగుతుందని, అవసరమైన వారు 6309897874 నంబర్లో తమను సంప్రదించాలని వారు కోరారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# 'బ్లాక్ ఫంగస్'కు పెద్దాసుపత్రిలో మందులు

జిల్లాలో బ్లాక్ ఫంగస్ వ్యాధి చికిత్సకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలు తీసుకున్నారు. నెల్లూరులోని పెద్దాసుపత్రిలో ఈ వ్యాధికి వైద్యం చేసేందుకు ఒక వార్డు ఏర్పాటు చేశారు. ఈ వార్డులో చేరిన బాధితులకు వైద్యం చేసేందుకు వైద్యులను నియమించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన అధికారులతో సమావేశమై జిల్లాలో కరోనా వ్యాధి కట్టడికి తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఇటీవల వస్తున్న బ్లాక్ ఫంగస్ వ్యాధి నుంచి కూడా ప్రజలకు రక్షణ కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల మందులు తెప్పించారు. అవసరమైతే అదనపు మందులు కూడా తీసుకువస్తామని, రోగులకు మెరుగైన వైద్య వసతులు లభించేలా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ హరేంద్రప్రసాద్‌తో పాటు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ ప్రభాకర్, పలు ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాధితులను దోచుకుతింటున్న ప్రైవేటాసుపత్రులు

## - ఏఐటియుసి నాయకుని ధ్వజం

కరోనాని అడ్డుపెట్టుకుని ప్రైవేట్ ఆసుపత్రులు ధనదాహంతో ప్రజలను దోచుకుతింటున్నాయని ఏఐటియుసి జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి దామా అంకయ్య ధ్వజమెత్తారు. ఇటీవల ఆయన నెల్లూరులోని సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ అసలే కరోనాతో ప్రజలు అల్లాడుతుంటే శవాల మీదపడి పీక్కుతినే రాబందుల్లా ఆ ఆసుపత్రుల వ్యవహరిస్తున్నాయని, రెమ్‌డెసివర్ ఇంజక్షన్ల పేరుతో లక్షలాది రూపాయలను బాధితుల నుంచి గుంజేస్తున్నారని ఆరోపించారు. కోవిడ్ మందులకయ్యే ఖర్చు వివరాలను, ఆక్సిజన్, వెంటిలేటర్, వైద్యుల ఫీజు వగైరా వివరాలన్నిటినీ ఆ ఆసుపత్రుల్లో బోర్డుపై ప్రకటించే విధంగా జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. శంకర్‌కిషోర్, ఆదినారాయణ, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా ఐసొలేషన్ కేంద్రానికి.. జెవివి చేయూత

నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 15 పడకల కరోనా ఐసొలేషన్ కేంద్రానికి గూడూరు జనవిజ్ఞాన వేదిక వారు 20వేల రూపాయలను ఆర్థికసాయంగా అందించారు. గతనెల 20న వారు ఆ నగదును జెవివి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంచలయ్య, జిలానీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ వేదిక అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాయకులు ఓరేపల్లి బాబు, సాయికిరణ్, మనోహర్‌గౌడ్, మహీధర్, బుజ్జయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## మనలో మాట

# ఆత్మస్తుతి.. పరనిందకే మహానాడు!



భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com


మామూలుగా మనం ఊళ్ళల్లో చూస్తుంటాం. అమ్మ వారి జాతరో... దేవుడి ఉత్సవమో జరుగుతుంటుంది. అంతా రొటీన్‌గా జరిగిపోతూ ఉంటుంది కానీ... ఎక్కడా భక్తి భావం అన్నది గోచరించదు. అంతా మెకానికల్‌గా జరిగిపోతూ ఉంటుంది. తెలుగుదేశం పార్టీ ఏటా మే నెలాఖరులో నిర్వహించే 'మహానాడు' కూడా ఇటువంటి జాతరే అనిపిస్తుంటుంది. కాకపోతే.. ఈ ఏడాది జరిగింది "ఆన్‌లైన్ జాతర" కాబట్టి.. జనం తరలిరావడం, ఎన్టీఆర్ వేషధారణతో ఒకరిద్దరు హడావుడి... పెద్దపెద్ద కబుర్లు చెప్పే చిన్నచిన్న పిల్లలు... వారిని చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వే 'బాబులు...', తప్పెట్లు, తాళాలు, డాన్సులు, స్టెప్పులు... నాయకులు, కార్యకర్తలు, అభిమానుల విచిత్ర వేషధారణలు... కుడి చేతి రెండు వేళ్ళను V ఆకారంలో ఎత్తి చూపుకుంటూ చేసుకునే అభివాదాలు, గోదావరి వంటలు... పలు రకాల మాంసాహార వంటకాల ఘాటు రుచులు... పూతరేకుల సందడి... నాయకుల భారీ కటౌట్లు, ఊకదంపుడు ఉపన్యాసాలు, 'ఖబడ్దార్ జాగ్రత్త...! మీ గుండెల్లో నిద్రపోతా'లు, సైడ్‌లైట్స్... మీడియా హడావిడిగా ఆవరణ కలయదిరుగుళ్లు..., టీవీ ఛానెళ్ల ఇంటర్వ్యూల కోలాహలం వగైరాలు ఏమీ లేకపోవడంతో... ఎవరింట్లో వారు కూర్చుని... ఈ ఏడాదికి 'జూమి'చ్చేశారు.

ఈ 'జూమించ'డం వల్ల పోలీసులపై అదనపు పని ఒత్తిడి తగ్గింది. ఆ సభా వేదికలకు చుట్టుపక్కల సహజంగా ఏర్పడి ఉండవలసిన 'శబ్ద కాలుష్యం' వల్ల కలిగే అసౌకర్యం నుంచి అక్కడి పౌర జీవనానికి ఉపశమనం లభించింది. అటు తెలంగాణ నుంచి, ఇటు మన రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి రావలసి ఉన్నవారికి రవాణా, కార్యకర్తల తరలింపు, వసతి రూపంలో పెద్దఎత్తున సొమ్ము ఆదా అయింది. ఈ 'జూమ్‌నాడు'లో చోటు చేసుకున్న రెండు, మూడు విశేషాలు ప్రస్తావించాలి. 2024లో జరగవలసి ఉన్న ('జమిలి' ఎన్నికల భయం ఇప్పుడు లేదు) అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి చంద్రబాబునాయుడు ఎంతగా తహతహలాడుతున్నారో వారి ప్రసంగాల్లో కనిపించింది. అలాగే, ప్రధాని మోదీతో తిరిగి సయోధ్యకు చంద్రబాబు ఎంతగా 'ఇదై' పోతున్నారో కూడా బయటపడిపోయింది.

కాసేపు ఈ విషయాలు పక్కన పెడితే, ఇంకో ముఖ్య విషయాన్ని ప్రస్తావించుకోవాలి. ఒక రాజకీయ పార్టీ ఏడాదికి ఓ మూడు రోజులు సమావేశాలు నిర్వహిస్తున్నది అంటే.. పార్టీపరంగా గతంలో చోటు చేసుకున్న తప్పొప్పులను సమీక్షించుకోవాలి. తప్పులు... పునరావృతం కాకుండా ఏమి చేయాలో చర్చించుకోవాలి. ఆ దిశగా వాటి తీర్మానాలు..., నాయకుల ప్రసంగాలు ఉండాలి. కానీ, ఈ మూడురోజుల మహానాడులో ఆ లక్షణాలు ఏమీ కనిపించలేదు. చంద్రబాబునాయుడు దగ్గరనుంచి, మాట్లాడిన వారందరూ... జగన్ ప్రభుత్వాన్ని నిలువునా విమర్శించిన వారే. చంద్రబాబు కూడా ఆయనను ఆయన అభినందించుకుని, జగన్‌ను ఓ నాలుగు శాపనార్థాలు పెట్టి ఆనందపడిపోయారు. మిగిలిన నేతలు కూడా అదే ఒరవడిలో చంద్రబాబును పొగిడి... జగన్‌ను తిట్టిపోశారు. ఆమాత్రం దాని కోసం... మహానాడు అని..., అది అని..., ఇది అని బిల్డప్‌లు ఎందుకు అన్నదే పాయింట్. జగన్‌ను, ఆయన వ్యవహారశైలిని నిరభ్యంతరంగా విమర్శించవచ్చు. తమను తాము అభినందించుకోనూ వచ్చు. అయితే.. 2019 ఎన్నికలకు ముందు దాదాపు 120 వరకు అసెంబ్లీ స్థానాలు కలిగిన తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల తరువాత 23కు ఎందుకు పడిపోయింది అనే అంశంపై ఎటువంటి చర్చా జరగలేదు. లోపం ఎక్కడో ఉండి ఉండాలి కదా! ఎక్కడ?

ఓటర్లలోనా? పార్టీలోనా? నాయకుడు చంద్రబాబులోనా.. తెలుగుదేశం ప్రభుత్వం అనుసరించిన విధానాలలోనా? పార్టీ నాయకులలోనా? శాసనసభ్యుల వ్యవహార శైలిలోనా? లేదా అభ్యర్థుల ఎంపికలోనా? ఎలక్షన్ మేనేజ్‌మెంటులోనా? ఫండింగ్‌లోనా? తనకు ప్రత్యామ్నాయం లేదన్న చంద్రబాబు అతి విశ్వాసంలోనా? ఎక్కడ లోపం జరిగింది? 2024లో మళ్లీ అధికారంలోకి రావడం కోసం తెలుగుదేశం ఏమి చేయాలనుకుంటున్నది? గతంలో జరిగిన లోటుపాట్లను గుర్తించి, అవి సరిదిద్దుకోవడం ద్వారా అధికారంలోకి రావాలని భావిస్తున్నదా? లేక జగన్‌ను, ఆయన ప్రభుత్వ విధానాలను విమర్శించడం ద్వారా ఓటర్ల అభిమానం చూరగొనాలని భావిస్తున్నదా? సరే. జగన్ మంచివాడు కాదు. దాని అర్థం నువ్వు మంచివాడివి అని కాదుకదా! నీకెందుకు ఓటు వేయడం? నోటాకు వేసుకుంటా. ఇది సింపుల్ లాజిక్. ఇలా.. ఏ విషయంపై అయినా మహానాడులో చర్చ ఏమైనా జరిగిందా అంటే, 'ఆత్మస్తుతి–పరనింద'కే అత్యధిక ప్రాధాన్యం లభించిందని చెప్పాలి. లేకపోతే, ఎన్నికలకు ఇంకా దగ్గర దగ్గర మూడేళ్ళ సమయం ఉన్నందున తప్పులను ఇప్పటినుంచే సరిదిద్దుకోవడం ఎందుకని అనుకున్నారో తెలియదు. ఈ మహానాడు సందర్భంగా మరో ముఖ్యవిశేషం బయటపడింది. కేంద్రంలో ఉన్న బీజేపీ(అంటే ప్రధాని మోదీ అని)ని మళ్లీ ఎలా ప్రసన్నం చేసుకోవాలా అన్న విషయం తెలియని తనం చంద్రబాబును కూర్చోనివ్వడం లేదు. నించోనివ్వడం లేదనే విషయం బయటపడిపోయింది. అసెంబ్లీ గత ఎన్నికలకు ముందు పశ్చిమ బెంగాలమ్మ మమతా బెనర్జీలా మోదీపై యుద్ధం చేసిన తెలుగుదేశం అధినేతను సింపుల్‌గా ఢిల్లీ పెద్దలు 23 స్థానాలకు పరిమితం చేశారు. మోదీ సహకారం, ఆశీస్సులు లేకుండా రాష్ట్రంలో అధికారంలోకి రాలేమని చంద్రబాబు నాయుడుకు ఇప్పుడు అర్థమయింది. తత్వం బోధపడింది. గత రెండేళ్ల పాలనలో ఒక్కసారి–అంటే–ఒక్కసారి కూడా బాబు కేంద్రాన్ని గానీ, బీజేపీని గానీ, మోదీని గానీ పల్లెత్తు మాట అనలేదు. విశాఖ ఉక్కును కేంద్రం ప్రైవేట్ పరం చేస్తే చంద్రబాబు కేంద్రం వైపు కనీసం వేలెత్తి చూపలేదు. రాష్ట్రానికి సంబంధించి ఏ అంశంలో అయినా ఆయన సీఎం జగన్‌ను టార్గెట్ చేస్తున్నారు గానీ, ఢిల్లీ వైపుకు చూడలేక పోతున్నారు. ఏపీ బీజేపీ నాయకులు టీడీపీని, బాబును ఎన్ని రకాలుగా విమర్శించినా... ఇటువైపు నుంచి సౌండ్ ఉండడం లేదు. అంత భయం పట్టుకుంది, మోడీ అంటే. ఇప్పుడు మహానాడులో కేంద్రానికి 'అంశాల వారీగా' మద్దతు అంటూ బయటపడిపోయారు. ఈ ప్రకటనతో, రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వర్గాలు ఆశ్చర్యపోయాయి. టీడీపీతో రాజకీయ ప్రయాణం సాగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అయితే చాలా ఘాటుగా స్పందించారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి సంబంధించి ఏమి మంచిపని చేసిందో చెప్పండి, మీరు మద్దతు ఇవ్వడానికి అంటూ ఝాడించి పారేశారు. అయినా టీడీపీ నుంచి సౌండ్ లేదు. 'విధం చెడ్డా...ఫలితం దక్కలేదు..' అన్న సామెత చందంగా, టీడీపీ సిగ్గు విడిచేసి మీ పంచన మళ్లీ ప్రకటించినా ఆ 'అంశాల వారీ మద్దతు' స్వీకరించడానికి ఢిల్లీ సిద్ధంగా లేదు. అవసరం లేదు కాబట్టి. గుజరాతీయులకు మామూలుగానే జ్ఞాపకశక్తి ఎక్కువ. మోదీకి మరీ ఎక్కువ. చంద్రబాబు తనను అవమానించిన తీరును ఆయన చివరిశ్వాస వరకు మరిచిపోరని బీజేపీ నాయకుడు ఒకరు చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీకి చంద్రబాబు చేసిన అవమాన ఫలితమే... ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేకహోదా' లేకుండా చేసింది. పోలవరంకు నిధులు రాకుండా చేసింది. రాజధాని శంకుస్థాపనకు గుప్పెడు మట్టి, చెంబుడు నీళ్లు తెచ్చేటట్టు చేసింది. ఒకటి కాదు. ఆంధ్రను పీకలమీద కేంద్రం అడుగేసి తొక్కేటట్టు చేసింది. ప్రత్యేక హోదాను అటకెక్కించింది. దాని ఫలితాలే.. జగన్‌కూ వారసత్వంగా వచ్చాయి.

ఇంతకీ, చెప్పుకోవాల్సిన పాయింట్ ఏమిటంటే ముఖ్యనాయకుల మాటల్లో ఆత్మ వంచనే తప్ప, చిత్తశుద్ధితో కూడిన మదింపు గానీ, భవిష్యత్ ప్రణాళిక గానీ కనిపించలేదు. మొత్తం మీద.. ఈ ఏడాది ఈ మహానాడు జరిగిన తీరు చూస్తుంటే.. రాజకీయ గుర్రపు స్వారీలో.. చంద్రబాబు నాయుడు ఓ చెక్కగుర్రం మీద కూర్చుని ఊగుతూ... జగన్‌తో పోటీ పడుతున్నట్టు కనపడుతున్నది.






## సౌమ్యశీలి, మృదుభాషి, సహృదయులు

# కాకుటూరు చంద్రశేఖరరెడ్డి కన్నుమూత

మినగల్లు శేఖరయ్యగా ఆయన సమకాలీకులు పిలుచుకునే కాకుటూరు చంద్రశేఖరరెడ్డి జూన్ 1వ తేదీ అర్ధరాత్రి సుమారు 2 గంటలా 10 నిముషాలు(తెల్లవారితే 2వతేదీ, బుధ వారం) తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 87 సంవత్సరాలు. కొంతకాలం అస్వస్థతో బాధపడు తుండిన శేఖరరెడ్డి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన స్వగ్రామం మినగల్లు. రైతు కుటుంబంలో జన్మించిన శేఖరరెడ్డి నెల్లూరు విఆర్ హైస్కూల్‌లో చదువుకున్నారు. సివిల్ కాంట్రాక్టర్‌గా ఆంధ్రా కర్ణాటక రాష్ట్రాలలో పని చేశారు. కాంట్రాక్టర్‌గా రిటైర్ అయిన అనంతరం పూర్తిస్థాయిలో గ్రామానికే పరిమితమై వ్యవసాయంపై దృష్టిపెట్టారు.

గ్రామపెద్దగా కోవూరు నియోజకవర్గ రాజకీయాలలో ఆయన ప్రభావం ఎక్కువగా ఉండేది. అతి చిన్నవయస్సులోనే మినగల్లు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై, గ్రామాభివృద్ధికి కృషిచేశారు. వవ్వేరు కో-ఆపరేటివ్ బ్యాంకు తొలి డైరెక్టర్లలో శేఖరరెడ్డి ఒకరు. నల్లపరెడ్డి, సోమిరెడ్డి కుటుంబాలతో శేఖరరెడ్డికి దగ్గర బంధుత్వముంది. నల్లపరెడ్డి సోదరులు చంద్రశేఖరరెడ్డిని చంద్రయ్యా అని ఆప్యాయంగా పిలిస్తే, శేఖరరెడ్డి వాళ్ళిద్దరినీ చంద్రమామా, శీనమామా అని సంబోదించేవారు. సున్నిత మనస్తత్వం కలిగిన శేఖరరెడ్డి ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించేవారు. మినగల్లు గ్రామంలో పెద్దదిక్కుగా ఎవరికి ఏ అవసరమొచ్చినా నేనున్నానంటూ ముందుకొచ్చేవారు. ఆయన నిష్క్రమణంతో ఇప్పుడు మినగల్లు మూగబోయింది. చంద్రశేఖరరెడ్డికి భార్య సుగుణమ్మ, కుమారుడు అనిల్‌కుమార్ రెడ్డి, కుమార్తె శైలజ ఉన్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్తగా, మద్రాసు తెలుగు సంఘాలలో కీలక వ్యక్తిగానే కాకుండా తిరుమల తిరుపతి దేవస్థానాల తమిళనాడు



ముఖ్యమంత్రి వైయస్ జగన్‌తో కాకుటూరు చంద్రశేఖరరెడ్డి

సలహా మండలి ఉపాధ్యక్షుడిగా కూడా శేఖరరెడ్డి కుమారుడు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి అందరికీ తెలిసినవారే. మాగుంట కుటుంబంతో కూడా అనిల్ కుమార్‌రెడ్డికి ఆత్మీయ అనుబంధముంది. ముఖ్యమంత్రి జగన్ చిన్నాన్న, టిటిడి చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి స్వంత తమ్ముడి కుమార్తె అనిల్‌కుమార్‌రెడ్డి కోడలు. జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీఅధ్యక్షుడిగా, గీతాంజలి సినిమా నిర్మాతగా శేఖరరెడ్డి అల్లుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కూడా అందరికి సుపరిచితులే. ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి కూడా రాష్ట్రవ్యాప్తంగా మంచి సినీ, రాజకీయ వ్యక్తులతో సన్నిహిత సంబంధాలున్నాయి. మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, ముని మనుమరాలితో పరిపూర్ణ జీవితం గడిపి దివంగతులైన శేఖరరెడ్డి ఆత్మశాంతికై ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# ఓర్పు-అవగాహనలతోనే కరోనా నివారణ



- ఎంపి ఆదాల

ప్రపంచ మహమ్మారిగా పరిణమిం చిన కరోనా నివారణకు ఓర్పు-అవగాహ నలే మార్గమని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గతనెల 30న ఆయనొక ప్రకటన విడుదల చేస్తూ, ఇది మన పూర్వీకులు కూడా కనీవినీ ఎరుగని మహమ్మరి వ్యాధి అని, దీనికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అందరూ బాధితులే నని, ఇది అందరిక పరీక్షా సమయమని, ఈ వ్యాధి నివారణకు ప్రభుత్వాలు, శాస్త్ర వేత్తలు తమవంతు కృషి చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. స్వేచ్ఛగా ఉండే సమాజంలో పూర్తిగా ఆంక్షలు విధించుకుని ఇంటిపట్టునే ఉండడం చాలా కష్టమని, అయినప్పటికీ తప్పనిసరైతేనే తప్ప బయటకు రావద్దని ఆయన సూచించారు. తప్పనిసరిగా మాస్కులు ధరించడం వల్ల మనతోపాటు ఎదుటివారు కూడా రక్షణ పొందుతారని, రోజువారీ జీవితంలో దూరాన్ని పాటిం చడం కూడా అత్యవసరంగా మారిందని పేర్కొన్నారు. శాస్త్రజ్ఞుల పరిశోధన ఫలి తాలు చివరిదశకు వస్తున్న ఈ తరుణంలో వ్యాక్సినేషన్ ద్వారా వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించుకోవడం, బలమైన ఆహా రాన్ని తీసుకోవడం, వ్యాయామం చేయడం తక్షణ అవసరమని, వీలైనంత మేరకు దూరాన్ని పాటిస్తూ ఓర్పుతో వ్యాక్సిన్ వేయించుకోవాలని, అదే మన జీవితాన్ని, మనకు ఇష్టమైనవారి ప్రాణాలను కాపాడు తుందన్నారు. కరోనా మహమ్మారి కార ణంగా ఎందరో మన ఆప్తులు, ఇష్టులను కోల్పోయామని, ఇదెంతో బాధ కలిగించే విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మనమంతా జాగ్రత్తతో ఉండాలని, అప్పుడే కరోనాను పారదోలడం సాధ్యపడుతుందని ప్రజలకు సూచించారు.

# పొగాకు ఉత్పత్తులతో అన్నీ అనర్ధాలే!..


పొగాకు ఉత్పత్తులతో అన్నీ అనర్ధాలేనని, యువతను నిర్వీర్యం చేస్తున్న ప్రాణాంతకమైన పొగాకు ఉత్పత్తులను వెంటనే నిషేధించాలని నెల్లూరులోని నారాయణ దంత వైద్యకళాశాల హెచ్ఓడి డాక్టర్ కన్నన్, డీన్ డాక్టర్ శివకుమార్ అన్నారు. మే 31న ప్రపంచ పొగాకు నివారణ దినం సందర్భంగా బుజబుజనెల్లూరులోని జిల్లా పిఎంపి కార్యాలయంలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్, ఎపియుడబ్ల్యుజె, నారాయణ డెంటల్ హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన 'పొగాకు విముక్తి' ఆందోళనలో వారు మాట్లాడారు. పొగాకు ఉత్పత్తుల వల్ల మెదడు, గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ తగ్గిపోతుందని, ప్రస్తుతం కరోనా విజృంభిస్తున్న తరుణంలో శ్వాసకోశం సామర్థ్యం తగ్గిపోయి మరణానికి చేరువవుతారని హెచ్చరించారు. పొగాకు ఉత్పత్తులు వాడడం హానికరమని, వాటివల్ల ఆరోగ్యం, ఆయుష్యు క్షీణిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొగాకు వాడకం వల్ల కలిగే అనర్ధాలను తెలియజేస్తూ కరపత్రాలను విడుదల చేశారు. పిఎంపి జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి, రూడ్స్ అధ్యక్షుడు షేక్ రసూల్ పాల్గొన్నారు.




### పుస్తక పాఠాల కంటే విలువైన... జీవిత పాఠాలు నేర్పిన

# గురువులకే గురువు... తుంగా వెంకటరమణారెడ్డి

***1950 నుండి 1980 జూన్ వరకూ నెల్లూరు విఆర్ కాలేజీలో చదివిన వారికెవరికైనా తుంగా వెంకటరమణారెడ్డి అంటే తెలియకపోయే ప్రసక్తే లేదు. టివిఆర్‌గా, మేనేజర్ రమణారెడ్డిగా ఆయన ప్రసిద్ధి. దాదాపు 3 దశాబ్దాలపాటు విఆర్ కళాశాల మేనేజర్‌గా ఎంతోమందికి మార్గదర్శనం చేసిన గొప్ప మనిషి, మానవతా విలువలున్న మహామనీషి తుంగా రమణారెడ్డి. పుస్తకాల్లోని పాఠాలు చెప్పకపోయినా ఎంతోమందికి జీవిత పాఠాలు నేర్పించిన ఆదర్శమూర్తి ఆయన.***



1944 మే 7వ తేదీన అంటే.. 77 సంవత్సరాల క్రితం ఆర్య సమాజ ఆధ్వర్యంలో జరిగిన తుంగా రమణారెడ్డి - సీతాలక్ష్మమ్మల పెళ్లి ఆహ్వాన పత్రిక

1920 జూన్ 4వ తేదీన తుంగా వెంకటశేషారెడ్డి – శంకరమ్మల ప్రథమ సంతానంగా జన్మించారు రమణారెడ్డి. నెల్లూరు జిల్లా దగదర్తి మండలం పెద్దపుత్తేడు ఆయన స్వస్థలం. రాజేశ్వరమ్మ, సుదర్శనమ్మ ఆయన తోబుట్టువులు. 1944 మే 7వ తేదీన సీతాలక్ష్మిని ఆయన సహధర్మచారిణిగా స్వీకరించారు. నవాబుపేటలోని పత్తివారితోటలో ఆర్య సమాజం ఆధ్వర్యంలో వీరి కళ్యాణం జరిగింది. వీరికి పిల్లలు లేరు. సీతా లక్ష్మమ్మ సోదరి కుమార్తె మాధవిని దత్తత తీసుకుని పెంచుకున్నారు. రమణారెడ్డికి చిన్న పిల్లలంటే మహా ఇష్టం, పిల్లి పిల్లలన్నా కూడా మక్కువ ఎక్కువ. ఆయన ఇంట్లో ఎప్పుడూ పిల్లులు తిరుగుతూనే ఉండేవి.

బిఏ పట్టా పుచ్చుకున్న అనంతరం కొంతకాలం ప్రభుత్వ రంగ ఉద్యోగం చేసిన రమణారెడ్డి ఆ తరువాతి కాలంలో ఏసి సుబ్బారెడ్డి బలవంతం మేరకు ప్రభుత్వ కొలువుకి గుడ్‌బై చెప్పి విఆర్ కాలేజీ మేనేజర్‌గా భాధ్యతలు చేపట్టారు. ఏసి సుబ్బారెడ్డి కూడా అన్ని విషయాల లోనూ రమణారెడ్డికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారని పాతతరం వారు చెప్పేవారు. కాలేజీ కమిటీ పెద్దలతోసహా, కాలేజీలో అత్యంత ప్రధాన బాధ్యతలు పోషించేవాళ్ళు సైతం, కళాశాలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకునే సమయంలో రమణారెడ్డి సూచనలు సలహాలు తీసుకుని వాటిని అమలుచేసేవారని చెప్తుంటారు. ఆయన విఆర్ కాలేజీలో మేనేజర్‌గా పనిచేస్తున్న 3 దశాబ్దాల కాలంలోనే అదే కాలేజీలో చదివిన విద్యార్థులు మళ్ళీ అక్కడే లెక్చరర్లుగా చేరి ప్రిన్సిపాల్‌గా కూడా బాధ్యతలు చేపట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.



1980 జూన్ 4న జరిగిన షష్ఠిపూర్తి మహోత్సవంలో సీతాలక్ష్మమ్మను పూలమాలతో సత్కరిస్తున్న తుంగా రాజగోపాలరెడ్డి సతీమణి శ్రీమతి శ్రీదేవమ్మ



## • విఆర్‌సి మేనేజర్‌గా 30 ఏళ్ళ సేవ

(జూన్ 4, 2021న మేనేజర్ రమణారెడ్డి 101వ జయంతి సందర్భంగా ఆయనను సంస్మరించుకుంటూ ఈ ప్రత్యేక వ్యాసం అందిస్తోంది 'లాయర్'.)

### నిరాడంబరుడు... నిష్కల్మష హృదయుడు...

నిష్కల్మషమైన నవ్వుతో, తెల్లని మల్లెపూవు లాంటి లాల్చీ, ధోవతితో చేతిలో అంతే తెల్లని కర్చీఫ్‌తో ఆయన నడచి వస్తుంటే గజరాజు నడిచి వస్తున్నట్లుగా వుండేదని ఆయన శిష్యులు చాలామంది ఇప్పటికీ ఆయనను తలచుకుంటుంటారు. మాటలో తియ్యదనం, పలుకులో కమ్మదనం, నడకలో నడతలో హుందాతనం ఆయన గొప్పతనం. తన చుట్టూ వున్నవారిని నవ్విస్తూ చమత్కారంగా మాట్లాడడం ఆయనలోని నిరాడంబరతకు నిదర్శనం. ఆయనకు వయసుతో నిమిత్తం లేదు. చిన్న పిల్లలతో సైతం కలసిపోయేవారు. వారితో కలిసి ఆడేవారు, పాడేవారు. అన్ని వయసుల వారికీ ఆయనంటే ఇష్టం, ఆయనంటే ప్రాణం. ముఖ్యంగా విఆర్ కాలేజీలో మేనేజర్‌గా పనిచేస్తున్న రోజులలో ఎంతోమంది విద్యార్థులకు సన్మార్గాన్ని నిర్దేశించి మార్గదర్శిగా నిలిచారు. ఎవ్వరినీ నొప్పించకుండా మాట్లాడడం ఆయన నైజం. అవతల వాళ్లకి అవసరం అంటే తన జేబులో ఎంత వుంటే అంత తీసి ఇచ్చేయడం ఆయనకు అలవాటు. ఏరోజూ తన గురించి తాను ఆలోచించుకోలేదు. ఆయన మేనేజర్ అయినప్పటికీ అధిక సంఖ్యలో విద్యార్థులు రమణారెడ్డి చుట్టూ ఉండేవారు. చదువులు చెప్పే గురువులకన్నా , నిత్యసత్యాలు బోధించే రమణారెడ్డి సారంటేనే చాలామందికి అభిమానంగా ఉండేది. ఆయన శిష్యులమని చెప్పుకోవడానికి ఇప్పటికీ చాలామంది గర్వపడతారు. దేశ విదేశాలలో అత్యున్నత స్థాయిలో స్థిరపడిన ఆయన శిష్యులు నెల్లూరుకు వస్తే ఆయనను చూడకుండా వెళ్ళేవారే కాదు.

### నటనన్నా.. సంగీతమన్నా... ప్రాణం

నటనా రంగం అంటే కూడా ఆయనకు చాలా ఇష్టం. సంగీతమన్నా ప్రాణం. ఒక ముక్కు మూసుకుని రెండవ ముక్కుతో రకరకాల సంగీతం వినిపించేవారు. ఇది బహు అరుదైన ప్రక్రియ. ఈ ఘనత ఆయనకే సొంతం. తాను కాలేజీ మేనేజరుగా ఉంటూనే కళాశాల వార్షికోత్సవాలలో విద్యార్థులు ప్రదర్శించే నాటికలు, మోనోయాక్షన్‌లకు రమణారెడ్డి నటనలో ట్రైనింగ్ ఇచ్చేవారు. కార్యక్రమం రక్తికట్టాలంటే ఎలా నటించాలో ఆయనే నటించి చూపించేవారు. ఆయన శిక్షణలో తర్ఫీదు పొందిన ఎంతోమంది తరువాతి కాలంలో నటనలో రాష్ట్రస్థాయిలో గుర్తింపును సాధించి, అవార్డులు పొందారు. అదే ఆసక్తితో తన తమ్ముడు తుంగా రాజగోపాలరెడ్డి 1959వ దశకంలో ఝూన్సీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మించిన 'జన్మహక్కు' సినిమాకి సహదర్శకుడిగా కూడా బాధ్యతలు నిర్వహిం చారు రమణారెడ్డి. ఓ వైపు కాలేజీలో విధులు నిర్వహిస్తూనే మరో వైపు తమ్ముడికి తోడుగా సినిమా రంగంవైపు కూడా దృష్టి సారించారు.

### మేనేజర్‌గా 3 దశాబ్దాలు

విఆర్ కాలేజీ 1920లో ప్రారంభమయ్యింది. రమణారెడ్డి పుట్టింది కూడా 1920లోనే. ఆయనకు 30 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు



తుంగా రమణారెడ్డి - సీతాలక్ష్మమ్మ దంపతులు

కాలేజీలో చేరిన రమణారెడ్డి 30 సంవత్సరాల పాటు కాలేజీలో తన సేవలందించి 1980 జూన్ 4న పదవీ విరమణ పొందారు. ఆయనతో పాటు ఆయన పనిచేసిన కాలేజీకి కూడా అదే ఏడాది 60 యేళ్లు నిండడం విశేషం. 1980 జూన్ 4వ తేదీన రమణారెడ్డి మిత్రులు, శిష్యులు కలసి 'మిత్ర కుటుంబం'గా ఏర్పడి నెల్లూరు పురమందిరంలో ఆయన షష్టిపూర్తిని ఘనంగా నిర్వహించారు. ఆత్మీయానురాగాల అపురూప వేడుకగా జరిగిన రమణారెడ్డి షష్ట్యబ్ది పండుగకు ఆనాడు టౌన్‌హాల్ వేదికయ్యింది. జిల్లాకు చెందిన ఎందరో ప్రముఖులు ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వతహాగా సోషలిస్టు భావాలు కలిగిన రమణారెడ్డి అతి బలవంతం పైన ఈ షష్టిపూర్తికి ఒప్పుకున్నారు. ప్రస్తుత భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కూడా ఆనాటి సభలో శాసనసభ్యుడి హోదాలో పాల్గొని, రమణారెడ్డి శిష్యపరమాణువులలో ఒకరిగా ఉపన్యసించారు. రేబాల లక్ష్మీనరసారెడ్డి వంటి ప్రముఖులు సైతం ప్రేక్షకులలో ఒకరుగా కార్యక్రమంలో పాల్గొని ఆనందించారు.

రిటైర్మెంట్ అనంతరం రమణారెడ్డి ఒక ప్రైవేట్ విద్యాసంస్థలో పెద్దదిక్కుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండేవారు. 1995 జనవరి 18న తన తమ్ముడు తుంగా రాజగోపాలరెడ్డి ఆకస్మిక మరణం రమణారెడ్డిని బాగా క్రుంగదీసింది. కొంతకాలం అస్వస్థతతో ఉండి, 1996 నవంబర్ 8వ తేదీ రాత్రి 10.30 గంటలకు నెల్లూరు హరనాథపురంలోని తన స్వగృహంలో 76వ ఏట రమణారెడ్డి తుదిశ్వాస విడిచారు. జూన్4, 2021న ఆయన 101వ జయంతి సందర్భంగా రమణారెడ్డిని స్మరించుకుంటూ.. ఆ మహనీయుని మహితాత్మకు నివాళులర్పిస్తోంది 'లాయర్'.



తన షష్ఠిపూర్తి మహోత్సవానికి హాజరైన మిత్రులు, ఆప్తులతో రమణారెడ్డి





## విద్యావేత్త మామిడిపూడి పట్టాభిరాం.. కన్నుమూత



నెల్లూరు విఆర్‌కాలేజీ బోటనీ విభాగం విశ్రాంత అధ్యాపకుడు, ప్రముఖ చిత్రకారుడు, విద్యావేత్త మామిడిపూడి పట్టాభిరాం గతనెల 27న కన్నుమూశారు. ఆయన వయస్సు 75 సంవత్సరాలు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తన నివాసంలోనే మృతిచెందారు. సుప్రసిద్ధ సాహితీవేత్త మామిడిపూడి వెంకట రంగయ్య కుటుంబానికి చెందిన పట్టాభిరాం, పట్టాభి మేస్టారుగా అందరికీ సుపరిచితులు. విశ్వభారతి స్కూలును కూడా ఏర్పాటుచేసి విద్యాబోధనలో నైతికవిలువలు, సామాజిక విలువలు బోధించి వేలాదిమంది విద్యార్థుల భవితకు మంచి బాటలు వేశారు. చిత్రకళలోనూ ఆయన ప్రతిభతో రాణించారు. కోరా, రత్నం వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో కూడా ఆయన విద్యాబోధన చేశారు. నెల్లూరులోని రామకృష్ణ సేవాసమాజంతో ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. విఆర్‌సి విశ్రాంత అధ్యాపకులు వెన్నెలకంటి శ్రీరామచంద్రరావు, విఆర్‌సి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం తదితర అధ్యాపకులు, సాహితీవేత్తలు, చిత్రకారులు పట్టాభిరాం మృతికి విచారం వ్యక్తం చేశారు. ఉత్తమ అధ్యాపకుడు, ఆధ్యాత్మికవేత్త అయిన పట్టాభిరాం మృతితో నెల్లూరుసీమ ఒక మంచి అధ్యాపకుడిని, చిత్రకారుడిని కోల్పోయినట్లయింది. ఆయన మృతికి నివాళులర్పిస్తూ.. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తోంది 'లాయర్'.

# బాలూ పుట్టినరోజు.. భరతజాతికే పండుగ రోజు



*తెలుగుజాతి గారాల బిడ్డ..భారతీయ సినిమా గాయకుడు..గానగంధర్వుడు..పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం..1946 జూన్ 4వ తేదీన జన్మించారు. నెల్లూరును మరో తిరువయూర్‌గా తలపింపజేసిన ప్రఖ్యాత హరికథా గాన కళాకోవిదుడు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి-శకుంతలమ్మల ముద్దుల తనయుడాయన. తెలుగుపాటకు అంతర్జాతీయ ఖ్యాతినార్జించిపెట్టిన ఎస్పీ బాలుకు..ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులున్నారంటే ప్రపంచ సంగీతరంగంలో ఆయనెంతటి విఖ్యాతిని సాధించారో అర్ధమవుతుంది. జూన్ 4.. కారణజన్ముడైన బాలు పుట్టిన రోజు. ఆ మహనీయుని, ఆ మహా గాయకుని..ఆ మహోన్నత మానవతామూర్తిని స్మరించుకోవడం..ఆయన 75వ జయంతి రోజున ఆయన జ్ఞాపకాల్లో బతకడం మన విధి. ఆయన పాటలను, మాటలను మన మనసుల్లో శాశ్వతముద్ర వేసుకుని, ఆరోజంతా మనమంతా...మన మనసంతా బాలు పాటల ఊయలలో ఊగుతూ..బాలు మాటల తోటలలో విహరిస్తూ..ఆయన్నే మనసారా స్మరించుకుందాం!..ఆయన జ్ఞాపకాలనే అందరం ఆత్మీయంగా పంచుకుందాం!.. వేలాది పాటలతో అశేష ప్రజల మనసులను ఉర్రూత లూగించిన ఆ మహాగాయకుని పుట్టినరోజును భరతజాతికే పర్వదినంగా మార్చుకుందాం!.. తెలుగుపాటకు పట్టాభిషేకం చేసిన రోజుగా ఆరాధించుకుందాం!.. మరోసారి బాలు.. మన బాలు.. మళ్ళీ ఈ తెలుగునేలపైనే పుట్టాలని ఆ భగవంతుడిని మనసారా కోరుకుందాం!...*

## ● జూన్ 4న 75వ జయంతి

**బాలు!..** ఈ మాట వింటే చాలు.. మాటలు మల్లెల మూటలవుతాయి..పాటలు తేనెల ఊటలవుతాయి. 'నిదురించే తోటలోకి..పాట ఒకటి వచ్చింది'.. అన్నట్లు.. మనసు పొరల్లోంచి తోసుకుని ఏదో ఒక మధురగానం రాగం తీస్తూ.. లోలోపలే వినిపిస్తుంది. బాలూ పేరు తలుచుకోగానే.. ఆయన ఆత్మీయమైన చిరు నవ్వు.. మనోహరమైన ఆయన రూపం.. ఆయన మాట.. పాట.. అన్నీ ఒకదానివెంట మరొకటి జ్ఞాపకానికొచ్చి.. మనసునంతా పులకింపజేస్తాయి. ఒక్కోసారి.. బాలు మన కళ్ళముందే నిలబడి.. మనపై పాటల పూలరెక్కలను కుమ్మరించి తీయని రాగాలతో అభిషేకిస్తున్నంత అనుభూతి కూడా కలుగుతుంది. ఆ పాటల పరవశత్వం అలాంటిది. అదే బాలూ గళంలోంచి మధురాతిమధురంగా పెల్లుబికి వచ్చే పాటల పరిమళం!..దివ్య పరిమళం!.. వసంతం వస్తే చెట్టు దగ్గరికే వస్తుంది..అన్నట్లుగా, బాలు పాట నవవసంతమై మన చుట్టూ పల్లవిస్తుంది.

బాలు!..ఒక వ్యక్తి కాదు..మహా శక్తి. పాటల లోకానికి ఆయనే రారాజు. సంగీత ప్రపంచంలో ఆయనో చక్రవర్తి. ఎంత కష్టపడ్డారో..ఎన్ని అపూర్వ విజయాలు సాధించారో!..ఒక గాయకునిగా తెలుగు తల్లి వరపుత్రునిగానే కాక..భరతమాత ముద్దుబిడ్డగా ఇంతటి ప్రఖ్యాతి తెచ్చుకునేందుకు ఆయనెంత శ్రమించారో!.. వేలాది పాటలు ఆ గళంలోంచి అలవోకగా జాలువారి నేరుగా ప్రజల మనసుల్లోకి ప్రవహించాయి. ఆయన పాటలన్నీ నేటికీ అందరికీ వినిపిస్తూనే ఉన్నాయి.. అందరినీ మైమరపిస్తూనే ఉన్నాయి. రేడియోల్లోనో...టీవీల్లోనో కాదు..ప్రజల నాలుకలపై ఆయన పాటలు నిలిచే ఉన్నాయి. ఇంతకన్నా శాశ్వతం ఎవరికి లభిస్తుంది.

సినీరంగంలోనే కాదు.. నిత్యజీవితంలోనూ ఆయన సాధించిన అపూర్వ విజయాలు.. ప్రతి ఒక్కరికీ ఆదర్శం. అందరితో ఎంతో అభిమానంగా ఉండడం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరినీ ఆత్మీయంగా పలకరించే నైజం.. ఆయనలోని గొప్ప సుగుణం. ఎంత ఎదిగినా ఒదిగినట్లుండాలనే మాటకు నిలువెత్తు నిదర్శనం.. బాలుగారు!..హిమాలయ శిఖరమంత యశస్సును సాధించినప్పటికీ, చిన్న పిల్లాడు ఓ మంచిపాట పాడినా శిరసువంచి మరీ జేజేలు పలికే ఆయన తత్వం..ఈ భూప్రపంచం మీద ఎవరి కుంటుంది?.. ఒక్క బాలుకు తప్ప!.. దటీజ్ బాలు!.. అందుకే ఆయనంటే ప్రజలకంత క్రేజ్!..

ప్రతి ఏటా జూన్ 4న ఆయన పుట్టినరోజును పండుగలాగా జరుపుకునే నెల్లూరీయులు కరోనా పుణ్యమా అని ఈ ఏడాది ఆయన జయంతిని జరుపుకోవాల్సి రావడం బహు బాధాకరం.

## ఆయన జ్ఞాపకాలతోనే... రోజంతా!

### 'జూమ్'లో జూన్ 4న బాలుకు సినీపరిశ్రమ స్వరనీరాజనం

గానగంధర్వుడు, భారతీయ సినిమా గాయకుడు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం) 75వ జయంతి రోజైన జూన్ 4వ తేదీన తెలుగు చలనచిత్ర పరిశ్రమ అంతా ఒక్కటై ఆ మధురగాయకునికి స్వరనీరాజనాలర్పించడానికి సంసిద్ధమైంది. ఆరోజంతా బాలు జ్ఞాపకాలతో గడిపేస్తారు. అందుకే ఆ రోజును ఎస్పీ బాలుకు అంకితం చేయాలని సినీపరిశ్రమ నిర్ణయించుకుంది. కనీవినీ ఎరుగని రీతిలో బాలుకు ఆ రోజున నివాళులర్పించబోతోంది. ఒక్క తెలుగు సినిమాకే కాకుండా అనేకభాషల్లోని సినిమాలకు, మొత్తంగా భారతీయ సినిమాకి బాలూ చేసిన సేవలను జ్ఞాపకం చేస్తూ జరిగే ఈ అపూర్వమైన కార్యక్రమంలో సినీరంగానికి చెందిన ప్రముఖులంతా పాల్గొంటారు.

జూన్ 4వ తేది ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు లైవ్‌లో ఈ స్వరనీరాజనం కార్యక్రమం జరగనుంది. ప్రత్యేకించి మెలోడి బ్రహ్మ మణిశర్మ ఎస్పీ బాలుపై స్వరపరచిన ఓ అద్భుతమైన గీతాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు. కోవిడ్ నేపథ్యంలో 'జూమ్'లో నిర్వహించే ఈ వేడుకల్లో సినీ పరిశ్రమ అంతా కనెక్ట్ అవుతుంది. కళాతపస్వి విశ్వనాథ్‌తో సహా ప్రముఖులందరూ పాల్గొంటారు.




**ఎస్పీ బాలు పుట్టినరోజు తేదీ, నెల, సంవత్సరం(04.06.46) వచ్చేలా ఉన్న 10రూపాయల నోటును సేకరించిన బాలు అభిమాని చిలకలూరుపేట నివాసైన నెల్లూరీయుడు 'నోటేశ్వరుడు' సిహెచ్ భాస్కర్‌రెడ్డి**




# పరమపావన క్షేత్రం.. కనుపర్తిపాడు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం





**సకల చరాచర విశ్వమంతా ఆ భగవంతుని స్వరూపమే.. ఆయన లేని చోటే లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే.. అంతా ఆయనే. ఆ అంతర్యామి లీలలు అద్భుతం. ప్రతి జీవిలోనూ, ప్రతి ప్రాణిలోనూ, ప్రతి వస్తువులోనూ ఆ సర్వేశ్వరుడున్నాడు. అన్ని రూపాలు ఆయనవే. అలాంటి అపూర్వమైన స్వరూపానికి కట్టుకున్న ఓ పవిత్రమైన కోవెలే.. నెల్లూరుజిల్లాలోని కనుపర్తిపాడు గ్రామంలో వెలసివున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం. శివశక్తి స్వరూపమైన ఆ సుబ్రహ్మణ్యే శ్వరస్వామి ఒక పుట్టలో నాగసర్ప స్వరూపంలో వెలసి భక్తులందరి పూజలందుకుంటున్నాడు. ఈ ఆలయం ఆవిర్భావానికి సంబంధించి ఎంతోకాలం నుంచి కొన్ని ఆసక్తికరమైన కథనాలు కూడా ఉన్నాయి.**

నెల్లూరు సమీపంలోని గొలగమూడికి వెళ్ళే దారిలో కనుపర్తిపాడు గ్రామం ఉంది. గ్రామం మొదట్లోనే అత్యద్భుతమైన దేవాలయం ఉంది. శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయంగా, సుబ్రహ్మణ్యస్వామి పుట్టగా పేరొందిన ఈ దేవాలయం అనాదిగా అశేష భక్తుల విశేష పూజలందుకుంటూ ఉంది. భక్తులకు కొంగుబంగారంగా నిలచిన ఈ ఆలయం ఎంతోకాలంగా దేదీప్యమానంగా అలరారుతూ జిల్లాలోని ప్రసిద్ధమైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాల్లో ఒకటిగా ప్రఖ్యాతి చెందింది.

## పుట్టలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఈ ఆలయం ఆవిర్భావానికి సంబంధించి వినిపిస్తున్న కథనాల ప్రకారం.. కొన్నేళ్ళ క్రితం శేషయ్య అనే వ్యక్తి ఈ ప్రాంతంలో ఉన్న పంట పొలాల్లో తిరుగుతుండగా అక్కడొక బాలుడు కనిపించాడు. నిర్జనప్రాంతంలో ఆ బాలుడు ఉండడం చూసిన శేషయ్య బాబూ నువ్వెవరు?.. మీ ఇల్లెక్కడ? అని అడగ్గా, నేనుండేది ఇక్కడే.. రా చూద్దువుగాని.. అంటూ ఆ బాలుడు ఆయన్ను కొంతదూరం తీసుకువెళ్ళి అక్కడున్న ఒక పెద్దపుట్ట వద్ద అదృశ్యమై.. ఆ వెనువెంటనే ఒక నాగసర్పంలా మారి పుట్టలోకి వెళ్ళిపోయాడు. దీంతో భయపడుతున్న ఆ వ్యక్తిని 'నువ్వేమీ భయపడవద్దు. నేను ఇక్కడే ఉంటాను. మళ్ళీ అయిదురోజులకు కనిపిస్తాను' అన్న మాటలు వినిపించి..వణికిపోతూ శేషయ్య గ్రామంలోకి వచ్చి ఆ విషయాన్ని ప్రజలకు చెప్పగానే, గ్రామస్తులంతా ఆ పుట్ట వద్దకు వచ్చి పూజలు చేయడం ప్రారంభించారు. ఈ వింత విషయం ఆనోటా ఈనోటా విన్న భక్తులు అయిదో రోజు ఆ మహిమగల బాలుడు కనిపిస్తాడేమోనని చెన్నై తదితర దూరప్రాంతాల నుంచి కూడా వేల సంఖ్యలో కనుపర్తిపాడును వెదుక్కుంటూ వచ్చి ఆ ప్రాంతంలో వెలసివున్న పుట్టను దర్శించుకున్నారు. మార్గమధ్యంలోనే అనేకమంది భక్తులకు అనేక రూపాల్లో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనభాగ్యం కలిగిందని, దాంతో ఆ పుట్టలో ఉన్నది సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అని గుర్తించి మరింత భక్తిశ్రద్ధలతో పూజలు చేయడం ప్రారంభించారు. ఈ పుట్ట కూడా ఎంతో అద్భుతంగా, ఎంతో పెద్దదిగా ఉంటుంది. గతంలో ఈ పుట్ట వద్ద అప్పుడప్పుడూ ఒక పెద్ద నాగసర్పం కూడా కనిపిస్తుండేదని కూడా భక్తులు చెప్తుంటారు. నాటి కాలం నుంచి నేటిదాకా ఎంతో మహిమాన్వితమైన ఈ పుట్టకు స్థానిక ప్రజలు, భక్తులంతా పూజలు చేస్తున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని పూజించుకునే భక్తులకు వ్యాధుల బాధలు తీరడం, కోరుకున్న కోర్కెలు నెరవేరుతుండడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య క్రమేణా బాగా పెరిగింది.

## అద్భుతంగా ఆలయ నిర్మాణం

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుట్ట చుట్టూ ప్రహరీ కట్టి గ్రామస్తులు భక్తులు పూజలు చేస్తుండగా దాతలు ఇక్కడో ఆలయాన్ని అత్యద్భుతమైన రీతిలో నిర్మించి స్వామివారి పట్ల తమ భక్తిని చాటుకున్నారు. సువిశాలమైన ప్రాంగణంలో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని నిర్మించి నిత్యం పూజలు



మన దేవాలయాలు (50)

చేస్తూ శ్రీ సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామివారి కరుణాకటాక్షాలకు పాత్రమవుతున్నారు. దాదాపు ఓ యాభై ఏళ్ళ క్రితం పుట్ట వద్ద శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను కూడా ప్రతిష్టించి ఆగమశాస్త్రప్రకారం సంప్రదాయబద్ధంగా పూజలు చేస్తున్నారు. ఆ తర్వాత కాలంలో ఆలయం ప్రాంగణలో ఎంతో సుందరమైన రీతిలో మహా గణపతి విగ్రహం, కాశీ విశాలక్షి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వరుని విగ్రహాలు, దంపతీ సమేత నవగ్రహ మండపం వగైరాలన్నీ అత్యద్భుతమైన రీతిలో నెలకొల్పడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుంటూ ఉన్నారు. ఎంతో సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్మించిన ఈ ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి పుట్టకు, స్వామివారికి, అమ్మవార్లకు ఆలయ అర్చకులు నిత్యపూజలు చేయడమే కాక, స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన కృత్తికా నక్షత్రంలో ప్రదోషపూజలు, ప్రతి షష్ఠికి విశేష పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఆలయాన్ని దర్శించుకుని ఆరోగ్యప్రదాత అయిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని పూజించుకుంటే ఎలాంటి కష్టాలైన ఇట్టే తొలగిపోతాయని, శారీరక మానసిక బాధలు, ఈతిబాధలు సమసిపోయి జీవితాల్లో శుభాలు కలుగుతాయని వేరే చెప్పనక్కరలేదు.


నివాళి



జననం : 23.8.1934 మరణం : 02.06.2021

నిరంతర సేవాభిలాషి, మా కుటుంబ శ్రేయోభిలాషి

శ్రీ కాకుటూరు చంద్రశేఖరరెడ్డి గారికి

అశ్రునివాళి.



తుంగా కుటుంబం



# గూడూరు డివిజన్ వార్తలు

## నిబంధనలు ఉల్లంఘిస్తే.. చర్యలు తప్పవు

**- సిఐ దశరథరామారావు**



కరోనా వైరస్ నియంత్రణలో భాగంగా గూడూరు పట్టణంలో పోలీస్‌లు కర్ఫ్యూను పకడ్బందీగా అమలు చేస్తున్నారు. గూడూరు పట్టణంలో అనవసరంగా వాహనాల్లో తిరిగే వారికి అపరాధ రుసుం విధిస్తున్నామని, ఈ-చలానా రూపంలో జరిమానాలు విధించడం జరుగుతోందని గూడూరు పట్టణ సీఐ దశరథరామారావు చెప్పారు. కరోనా నేపథ్యంలో ప్రజలెవరూ అనవసరంగా బయటకు రావొద్దన్నారు. నిబంధనలు ఉల్లంఘించినవారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని వాహనదారులను హెచ్చరించారు. ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే దుకాణాలు తెరచి ఉంచాలని, 12 గంటల తర్వాత ఎవరైనా దుకాణాలు తెరచి ఉంచినా, కర్ఫ్యూ నిబంధనలు పాటించక పోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

## ఫంక్షన్లు కాదు... ప్రాణాలు ముఖ్యం

కరోనా కర్ఫ్యూ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, ఫంక్షన్లు కాదు.. ప్రాణాలు ముఖ్యమని గూడూరు మండల తహశీల్దార్ బాల లీలారాణి ప్రజలను కోరారు. ఇటీవల ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పెళ్లిళ్ల సమయంలో వధూవరులు ఇద్దరివైపున 20 మందికి మాత్రమే అనుమతిస్తామన్నారు. కోవిడ్ పాజిటివ్ వస్తే కోవిడ్ కేర్ సెంటర్‌కు వెళ్లాలని, అన్ని గ్రామాల ప్రజల సౌకర్యార్థం తహశీల్దార్ కార్యాలయంలో ఓ వాహనం అందుబాటులో ఉందని తెలిపారు. కోవిడ్ కేర్ సెంటర్‌లో ఉచిత వైద్యం, ఆహారంతో పాటు మానసిక ఉల్లాసం కోసం యోగా, చలనచిత్ర ప్రదర్శనలు, కార్యమ్స్, షటిల్ లాంటి క్రీడలు ఆడేందుకు అవకాశం కల్పించారని ఆమె తెలియజేశారు.

## దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్

**- మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ**



దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా ఉంటూ జనరంజకంగా పాలన సాగిస్తున్నారని గూడూరు మునిసిపాలిటీ మాజీ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ కొనియాడారు. గతనెల 30న గూడూరు పట్టణంలోని తన నివాసంలో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి పాలన రెండేళ్లు పూర్తి చేసుకొని మూడో సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా సీఎంకు అభినందనలు తెలిపారు. ఈ రెండేళ్ళ పాలనలో చరిత్రలో నిలిచిపోయే విధంగా అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని ఆమె కొనియాడారు. కరోనా విపత్కర సమయంలో పేదల జీవనం కష్టమైనప్పటికీ సంక్షేమ పథకాలే వారిని అదుకున్నాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వాలంటీర్‌ల వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా వివిధ కులాల వారికి పథకాల పేరిట చేయూత అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగాలకు సీఎం పెద్దపీట వేశారని, రైతులకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ రెండేళ్ల పాలనలో 94.5 శాతం హామీలను జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారని ఆమె పేర్కొన్నారు.

## కోవిడ్ బాధితులకు రొటేరియన్ల సేవ




గూడూరు గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రికి ఈనెల 2న 35 ఆక్సిజన్ సిలిండర్లును రోటరీ క్లబ్ అధ్వర్యంలో రొటేరియన్‌లు దశరథరామిరెడ్డి, నాగసునీల్ దాతృత్వంతో సమకూర్చారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జి.యస్.రాఘవరెడ్డి మాట్లాడుతూ కరోనాతో ఇబ్బందిపడుతున్న వారికి ఆక్సిజన్ అవసరమని, గవర్నమెంట్ హాస్పిటల్ ఆర్ఎం శైలజ మరియు సూపరింటెండెంట్ రామకృష్ణ తమకు తెలపడంతో 35 ఆక్సిజన్ సిలిండర్స్ ఇవ్వటం జరిగిందన్నారు. దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ ఆక్సిజన్ సిలిండర్లు అవసరమైతే తమ క్లబ్ సభ్యులను సంప్రదిస్తే వాటిని ఇవ్వడం జరుగుతుందన్నారు. డాక్టర్ శ్యామ సుందరరావు(మయూరి శ్యామ్‌యాదవ్) మాట్లాడుతూ అందరూ తప్పనిసరిగా మాస్క్‌ను వాడాలని, భౌతిక దూరం పాటించాలని కోరారు. ఆర్ఎం శైలజ మాట్లాడుతూ రోటరీ క్లబ్ వారిని అడిగిన వెంటనే ఆక్సిజన్ సిలిండర్లను ఇచ్చినందుకు రోటరీ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, దశరథరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్‌కు, రోటరీక్లబ్ సభ్యులందరికి ధన్యవాదాలు తెలిపారు.

## ఆసుపత్రికి జేవివి చేయూత

- **రీఫిల్ చేసిన 30 ఆక్సిజన్ సిలిండర్ల అందజేత**

గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అడపాల సందీప్ కుటుంబం, మరియు అల్లూరు వెంకటేశ్వర్లు కుటుంబం సంయుక్త సహకారంతో గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఇటీవల రీఫిల్ చేసిన 30 ఆక్సిజన్ సిలిండర్లు అందజేశారు. అడపాల సందీప్ మాట్లాడుతూ నిరుపేదలు ఎక్కువగా వచ్చే ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన ప్రాణవాయువు అవసరాలను తమ రెండు కుటుంబాల వారిద్వారా అందించడం తమకెంతో ఆనందంగా ఉందున్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక వారికి, ప్రభుత్వ డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. జె.వి.వి. ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో జె.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, అడపాల సందీప్, ఓరేపల్లిబాబు, మనోహర్ గౌడ్, గోపి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్.యం,ఓ శైలజ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డా. కొండ్లపూడి సుబ్బారెడ్డి గారు

జననం : 14.06.1947 మరణం : 10.05.2021

## శ్రద్ధాంజలి



నిష్కల్మష హృదయుడు,
మా ఇంటి దైవం, మా పెద్దదిక్కు

**డా. కొండ్లపూడి సుబ్బారెడ్డి గారు**
ఇందుపూరు

తే. 10.05.2021దీ, సోమవారం పరమపదించారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య : కొండ్లపూడి పద్మ
అత్తిపల్లి లక్ష్మీ అక్షిత - అత్తిపల్లి సాయిశ్రావణ్
కుమార్తెలు - అల్లుడు
నూకలపాటి లత - మధుసూదన్‌రెడ్డి
కొండ్లపూడి జ్యోతి



Late. Tunga RajaGopalaReddy Garu
Founder, Lawyer Weekly

40 లాయర్ YEARS

We wish
the epitome of honesty
LAWYER PATRIKA
on it's successful
completion of 40 years.



G.V.K. Reddy
Chairman

GVK
GROUP


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com